


www.vibharenews.com

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 21 మే 2021 సంపుటి : 02 సంచిక :308 పేజీలు : 4 వెల : రూ 3-00


## నాటుసారా స్థావరం పై పోలీసులు దాడి

విజయనగరం జిల్లాలోని జియ్యమ్మవలస మండలం కొండచిలకం గ్రామ పంచాయితీ, నిడగల్లు గూడ గ్రామంలో పోలీసుల దాడులు జరిగాయి. ఎల్విన్ పేట సి.ఐ. టి.వి.తిరుపతి రావు ఆధ్వర్యంలో జియ్యమ్మవలస ఎస్. ఐ. రాజేష్, సిబ్బంది తో కలిసి నాటుసారా తయారీ కేంద్రాలు పై దాడి జరిపారు. ఈ దాడిలో 27000 లీటర్ల బెల్లం ఊటతో పాటు నాటుసారాకు ఉపయోగించే వంటసామగ్రిని ధ్వంసం చేసి.17 డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సి.ఐ. తిరుపతి రావు మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా నాటుసారా అమ్మినా, ,తరలించినట్ల అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 2 లక్షల 29 వేల కోట్లతో సంక్షేమ బడ్జెట్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ఒకరోజు అసెంబ్లీ సమావేశం ప్రారంభమైంది. అసెంబ్లీలో గురువారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2021-22 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్ అంచనా రూ.2,29,779.27 కోట్లుగా తెలిపారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్ద పీట వేశారు. బీసీ ఉప ప్రణాళికకు రూ.28,237 కోట్లు, కాపు సంక్షేమానికి రూ.3,306 కోట్లు, ఈబీసీ సంక్షేమానికి రూ.5,478 కోట్లు, బ్రాహ్మణ సంక్షేమానికి రూ.359 కోట్లు, ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.17,403 కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్‌కు రూ.6,131 కోట్లు బడ్జెట్‌లో వెచ్చించారు. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి కన్నబాబు ప్రవేశపెట్టున్నారు. సభ ప్రారంభం కాగానే పలువురు మాజీ ఎమ్మెల్యేల మృతిపట్ల అసెంబ్లీ సంతాపం తెలిపింది.

**విద్యా రంగానికి రూ.24,624 కోట్లు**

పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువేనని



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలంగా నమ్ముతారు. రాష్ట్ర విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన 2021-22 వార్షిక బడ్జెట్‌లో విద్యా రంగానికి సంబంధించిన కేటాయింపులతో ఈ విషయం మరోమారు స్పష్టమైంది.ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా.. విద్యా రంగానికి రూ.24, 624.22 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా.. పాఠశాలల్లో నాడు-నేడుకు రూ.3,500 కోట్లు, జగనన్న గోరుముద్ద కోసం రూ.1200 కోట్లు, జగనన్న విద్యాకానుకు కోసం రూ.750 కోట్లు, ఉన్నత విద్య కోసం రూ.1973 కోట్లు కేటాయించారు. కాగా గత బడ్జెట్‌లో ప్రాథమిక ఉన్నత విద్యకు రూ. 22,604. 01 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే.

**కోవిడ్‌పై పోరుకు రూ.1000 కోట్లు**

కోవిడ్ కట్టడి కోసం తీవ్రంగా కృషి చేస్తున్న ప్రభుత్వం దానిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా మహమ్మారిపై పోరు కోసం బడ్జెట్‌లో 1000 కోట్ల రూపాయలు కేటాయించింది.ఇక బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి మొత్తం 13,840.44 కోట్ల రూపాయలు కేటాయించింది ప్రభుత్వం. ఆరోగ్యశ్రీ ,మందులకొనుగోలుకు రూ.2,248. 94 కోట్లు.. ఆస్పత్రుల్లో నాడు-నేడు కార్యక్రమానికి రూ.1535 కోట్లు.. కోవిడ్‌పై పోరాటానికి రూ.1000 కోట్లు.. ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో శానిటేషన్‌కు రూ.100 కోట్లు.. శ్రీకాకుళం జిల్లా పలాస ఆస్పత్రికి రూ.50 కోట్ల చెప్పున కేటాయించింది.

**మహిళా సాధికారతకు పెద్ద పీట**

మహిళా సాధికారతకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. ఇందుకోసం రూపొందించిన










వైఎస్ఆర్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత పథకాలకు కేటాయింపులు చేశారు. వైఎస్ఆర్ ఆసరా..మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కలగజేయడం కోసం.. అప్పుల ఊబి నుంచి బయటపడేయటం కోసం ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా 2019, ఏప్రిల్ 11 నాటికి ఉన్న 27,168 కోట్ల రూపాయల బ్యాంకు బకాయిల్లో.. మొదటి విడతగా 2020 సెప్టెంబర్ 11న 6,337 కోట్ల రూపాయలు విడుదల చేసింది. రెండవ విడతలో భాగంగా 2021-22 ఏడాదికి గాను మరో 6,337 కోట్ల రూపాయలను ఖర్చు చేయబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఏపీ ప్రభుత్వం 2020 ఏప్రిల్ 24 వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా 2019-20 సంవత్సారానికి చెందిన రుణాలపై వడ్డీకి సంబంధించి 1400 కోట్ల రూపాయలను బదిలీ చేయడం జరిగింది. మొదటి విడతలో భాగంగా ఏప్రిల్ 2021లో ఈ పథకానికి 1,112 కోట్ల రూపాయలు విడుదల చేయగా.. 2021-22కు గాను మరో 1,112 కోట్ల రూపాయలను కేటాయించింది. వైఎస్ఆర్ చేయూత మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం 2020 ఆగస్టు 12న వైఎస్ఆర్ చేయూత కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా 45-60 ఏళ్ల లోపు షెడ్యూల్డ్ కులాల, తెగల, వెనకబడిన తరగతుల, అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన 23 లక్షల 76 వేల మహిళా లబ్ధిదారులకు 4,455 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది.

### అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

**బడ్జెట్ కేటాయింపులు ఇలా..**

బీసీ ఉప ప్రణాళిక: రూ.28,237 కోట్లు ,ఎస్సీ ఉప ప్రణాళిక: రూ.17,403 కోట్లు,ఎస్టీ ఉప ప్రణాళిక: రూ.6,131 కోట్లు,కాపు సంక్షేమం: రూ.3,306 కోట్లు,ఈబీసీ సంక్షేమం: రూ.5,478 కోట్లు,బ్రాహ్మణ సంక్షేమం: రూ.359 కోట్లు,మైనార్టీ యాక్షన్ ప్లాన్: రూ.1,756 కోట్లు,చిన్నారుల కోసం రూ.16,748 కోట్లు,మహిళల అభివృద్ధి: రూ.47,283.21 కోట్లు,వ్యవసాయ పథకాలు: రూ.11,210 కోట్లు,విద్యా పథకాలు: రూ.24,624 కోట్లు,వైద్యం, ఆరోగ్యం: రూ.13,830 కోట్లు,వైఎస్సార్ పింఛన్ కానుక: రూ.17 వేల కోట్లు,వైఎస్సార్ రైతు భరోసా: రూ.3,845 కోట్లు,జగనన్న విద్యా దీవెన: రూ.2,500 కోట్లు,జగనన్న వసతి దీవెన: రూ.2,223.15 కోట్లు,వైఎస్సార్-పీఎం ఫసల్ బీమా: రూ.1802 కోట్లు,డ్వాక్రా సంఘాల సున్నా వడ్డీ చెల్లింపులు: రూ.865 కోట్లు,పట్టణ ప్రాంత డ్వాక్రా మహిళలు: రూ.247 కోట్లు,రైతులకు సున్నా వడ్డీ చెల్లింపులు: రూ.500 కోట్లు,వైఎస్సార్ కాపు నేస్తం: రూ.500 కోట్లు,వైఎస్సార్ జగనన్న చేదోడు: రూ.300 కోట్లు,వైఎస్సార్ వాహన మిత్ర: రూ.285 కోట్లు,వైఎస్సార్ నేతన్న నేస్తం: రూ.190 కోట్లు,వైఎస్సార్ మత్స్యకార భరోసా: రూ.120 కోట్లు,మత్స్యకారులకు డీజిల్ రాయితీ: రూ.50 కోట్లు,అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లింపులు: రూ.200 కోట్లు,రైతులకు నష్ట పరిహారం: రూ.20 కోట్లు,లా నేస్తం: రూ.16.64 కోట్లు,ఈబీసీ నేస్తం: రూ.500 కోట్లు,వైఎస్సార్ ఆసరా: రూ.6,337 కోట్లు,అమ్మఒడి: రూ.6,107 కోట్లు,వైఎస్సార్ చేయూత: రూ.4,455 కోట్లు,రైతు పథకాలు: రూ.11,210.80 కోట్లు

# నాకు ప్రాణం విలువ బాగా తెలుసు: సీఎం జగన్



అమరావతి: సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రెండేళ్ల కాలంలో ప్రతీ కుటుంబానికి లబ్ది చేకూరేలా సంక్షేమ పాలన అందించామని పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో సీఎం జగన్ గురువారం మాట్లాడుతూ... కోవిడ్ మహమ్మారితో ప్రాణాలు కోల్పోయిన వారికి ఏపీ అసెంబ్లీ నివాళి అర్పిస్తోందన్నారు.“మహానేత కోసం ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలను ఓదార్పుయాత్రతో పరామర్శించా. నాకు ప్రాణం విలువ బాగా తెలుసు. అందుకే ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. ఫోన్ చేసిన 20 నిమిషాల్లో అంబులెన్స్ వచ్చేలా మార్పులు చేశాం. ప్రతి 2 వేలమంది జనాభాకు ఒక ఏఎన్ఎంను ఏర్పాటు చేశాంవవ అని తెలిపారు

**గడిచిన 14 నెలల్లో కోవిడ్ నియంత్రణకు రూ.2,229 కోట్లు**

మహమ్మారి కరోనాపై పోరు గురించి సీఎం జగన్ మాట్లాడుతూ... “కోవిడ్ రోగుల కోసం 47 వేల బెడ్లను అందుబాటులోకి తీసుకొచ్చాం . కోవిడ్ కేర్ సెంటర్లలోనూ 52 వేల బెడ్లను అందుబాటులోకి తెచ్చాం.18 వేల ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందుబాటులోకి తెస్తున్నాం. కోవిడ్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చి ఉచిత వైద్యం అందిస్తున్నాం. గడిచిన 14 నెలల్లో కోవిడ్ నియంత్రణకు రూ.2,229 కోట్లు కేటాయించాం. కోవిడ్ సమాచారం కోసం 104ను అందుబాటులోకి తెచ్చాం. ఇప్పటివరకు 3.12 లక్షలమంది 104 సేవలు వినియోగించుకున్నారు. 104 ద్వారా 60 వేలమందికిపైగా కోవిడ్ రోగులకు ఆస్పత్రుల్లో బెడ్లు ఏర్పాటు చేశాం. టెలీమెడిసిన్ ద్వారా 3,991 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. విదేశాల నుంచి ఆక్సిజన్‌ను దిగుమతి చేసుకుంటున్నాంవవ అని పేర్కొన్నారు.

**సీఎం జగన్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**

బ్లాక్ ఫంగస్ చికిత్సను ఆరోగ్యశ్రీలో చేర్చాం. దీని చికిత్స కోసం 17 ఆస్పత్రులను నోటిఫై చేశాం

టీచింగ్ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ జనరేటర్లు ఏర్పాటు చేస్తాం. 50 ఆక్సిజన్ ట్యాంకర్లను కొనుగోలు చేశాం

నర్సులు, డాక్టర్లు, హెల్త్ వర్కర్లు, అధికారుల కృషి వల్ల.. మరణాల రేటు తక్కువగా ఉన్న రా(ష్టాల్లో మనమూ ఉన్నాం

కోవిడ్ కేసులను వెంటనే గుర్తించి వేగంగా వైద్యం అందించడం ద్వారానే మరణాల రేటును తగ్గించగలుగుతున్నాం దేశంలో 18 ఏళ్ల పైబడిన వారందరికీ వ్యాక్సిన్ వేయాలంటే.. 172 కోట్ల వ్యాక్సిన్ డోసులు అవసరం. కానీ దేశంలో నెలకు 7 కోట్ల డోసుల ఉత్పత్తికి మాత్రమే సామర్థం ఉంది. ఇక దేశంలో ఇప్పటివరకు 18.44 కోట్ల మందికి మాత్రమే వ్యాక్సినేషన్ పూర్తైంది రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన అందరికీ వ్యాక్సిన్ వేయాలంటే.. 7 కోట్ల డోసులు అవసరం ఉంది

వ్యాక్సిన్ కోటా కేటాయింపు ప్రక్రియ పూర్తిగా కేంద్రం నియంత్రణలో ఉంది వాస్తవాలు తెలిసి కూడా కొంతమంది వక్రీకరిస్తున్నారు భారత్ బయోటెక్ స్వయంగా రామోజీరావు కుమారుడి వియ్యంకుడిదే. ఆ కంపెనీ ఉత్పత్తి సామర్థం ఎంతో వారికి తెలియదా? అయినా అన్నీ తెలిసి కూడా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. వ్యాక్సిన్ల కోసం ప్రభుత్వం గ్లోబల్ టెండర్లను కూడా పిలిచింది. వ్యాక్సిన్లు ఎలాగైనా తెస్తాం.. ప్రజలకు ఉచితంగా ఇస్తాం. “మనం నాలుగు బిల్డింగ్‌లు కడితే అభివృద్ధి జరిగినట్లు కాదు. నిన్నటికంటే ఈరోజు బాగుండాలి. రేపు మరింత బాగుంటుందనే భరోసా కల్పించాలి.

# వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో టీకాల వృథాను ఆపాలి

### అధికారులకు సూచించిన ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ మే 20 కరోనాకు వ్యతిరేకంగా సాగుతున్న వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో టీకాల వృథాను ఆపాలని ప్రధాని నరేంద్ర మోదీ అధికారులకు సూచించారు. గురువారం ఆయన పది రాష్ట్రాలకు చెందిన 54 జిల్లాల అధికారులతో వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. సందర్భంగా కరోనా కట్టడి తీసుకుంటున్న చర్యలను, ప్రణాళికలను అధికారులు మోదీకి వివరించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో కరోనా కట్టడి చర్యలపై ప్రధాని ఆరా తీశారు. భేటీలో ఛత్తీస్‌గఢ్, హర్యానా, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, రాజస్థాన్, బెంగాల్ అధికారులు పాల్గొన్నారు.అనంతరం ప్రధాని మాట్లాడుతూ వందేళ్లలో వచ్చిన అతిపెద్ద విపత్తు కరోనా అన్నారు. కరోనా వైరస్ కారణంగా జిల్లా అధికారులు.. తమ విధులు నిర్వర్తించటం సవాల్గా మారిందన్నారు. అందుబాటులో ఉన్న వనరులతో మహమ్మారిపై పోరాడాలన్నారు. కరోనా వైరస్ ఉత్పరివర్తనం చెంది వ్యాప్తి చెందుతోందన్నారు. వైరస్‌పై విధానాలు, వ్యూహాలు నిత్యం మార్చుకోవాలని చెప్పారు. మ్యుటెంట్ల నేపథ్యంలో యువత, చిన్నారులపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. కరోనా బారినపడిన యువత, చిన్నారుల వివరాలు సేకరించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ వృథాపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని.. టీకా వృథాను ఆపడం అత్యంత ముఖ్యమన్నారు. ఒక్కో డోసు వృథా.. ఒక జీవితానికి రక్షణ కల్పించే అవకాశం వృథా అయినట్టేనన్నారు. వ్యాక్సిన్ వృథాను అరికట్టాలని, పట్టణ.. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులంతా పర్యవేక్షించాలని కోరారు. రాష్ట్రాలకు వ్యాక్సిన్ల సరఫరాపై స్పందిస్తూ ఆరోగ్య మంత్రిత్వశాఖ 15 రోజుల పాటు టీకాలకు సంబంధించిన సమాచారం రాష్ట్రాలకు అందిస్తుందని, వ్యాక్సినేషన్‌లో సహాయపడుతుందన్నారు.ప్రజలు తమ జీవనాన్ని సులభతరం చేసేందుకు ఉచిత రేషన్, ఇతర నిత్యావసర సామగ్రి అందించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కోరారు.

# కోవిడ్ పై పోరాడుతున్న ఫ్రంట్లైన్ వర్కర్లకు సెల్యూట్

### గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

అమరావతి గురువారం నాడు ఉభయ సభలనుద్దేశించి వర్చువల్ విధానంలో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రసంగించారు. కోవిడ్ను ఎదుర్కోవడంలో ఏపీ.. దేశానికే ఆదర్శంగా నిలిచిందని అయన కొనియాడారు. దేశవ్యాప్తంగా ఫిబ్రవరి నుంచి కోవిడ్ సెకండ్ వేవ్ ఉద్ధృతంగా ఉందన్నారు. “దేశవ్యాప్తంగా రోజుకు 4 లక్షలకు పైగా కోవిడ్ కేసులు నమోదయ్యాయి. సెకండ్ వేవ్లో మరణాల సంఖ్య ఎక్కువగా ఉంది. కరోనా సెకండ్ వేవ్ ప్రభావం ఏపీలోనూ ఉంది. కోవిడ్పై పోరాడుతున్న ఫ్రంట్లైన్ వర్కర్లకు సెల్యూట్. కొత్తగా కోవిడ్ సెంటర్లు ఏర్పాటు చేశాం. తి ప్రైవేట్ ఆస్పత్రిలోనూ కోవిడ్ చికిత్స కోసం ఆరోగ్యశ్రీ కింద ఏర్పాటు చేశాం. ఆక్సిజన్ కొరత లేకుండా ఇతర దేశాల నుంచీ క్రయోజనిక్ ఆక్సిజన్ తెప్పించాని గవర్నర్ తెలిపారు

# వ్యవసాయ బడ్జెట్ రూ.31,256 కోట్లు



అమరావతి: మంత్రి కురసాల కన్నబాబు అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టారు. రైతు సంక్షేమ రాజ్యంలో 2021-22 ఏడాదికి గానూ.. వివిధ పథకాల కోసం రూ.31,256.36 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.ఈ పథకం కోసం ప్రస్తుత బడ్జెట్‌లో 7,400 కోట్ల రూపాయాలను ప్రభుత్వం కేటాయించింది. కాగా 2020-21 బడ్జెట్‌లో రూ. 13,500 చొప్పున రైతులకు మాత్రమే కాకుండా కౌలుదారులు, అటవీ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా ఏపీ ప్రభుత్వం మొత్తంగా, 6,928 కోట్ల రూపాయల పెట్టుబడి సాయం అందించిన విషయం తెలిసిందే. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం లేకుండా ఉచిత పంటల బీమాను అమలు చేస్తున్న ఏపీ ప్రభుత్వం ఈసారి 1802 కోట్ల 82 లక్షల రూపాయలు కేటాయించింది. అదే విధంగా అర్హత గల రైతులందరికీ బీమా సదుపాయాలు అందించుటకొరకు ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ(ఏపీజీఐసీ) అనే ప్రభుత్వ కంపెనీని స్థాపించనున్నట్లు తెలిపింది.అర్హత గల రైతుల బ్యాంకు ఖాతాలలోనే ప్రభుత్వం నేరుగా వడ్డీ రాయితీ మొత్తాన్ని జమచేస్తోంది. 2014-15 నుంచి 2018-19 వరకు చెల్లించవలసిన రూ. 688 కోట్ల బకాయిలను కూడా సీఎం జగన్ ప్రభుత్వమే చెల్లించింది. తద్వారా 51 లక్షల 81 వేల మంది లబ్ది పొందారు. ఇక 2021-22 సంవత్సరానికి గానూ ఈ పథకం కోసం.. రూ. 500 కోట్లు కేటాయించింది.ప్రభుత్వం 10,544 గ్రామీణ, 234 పట్టణ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏపీ అసెంబ్లీలో తీర్మానం

అమరావతి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏపీ అసెంబ్లీలో తీర్మానం జరిగింది. పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ తీర్మానం గురువారం శాసనసభ ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాసినట్లు తెలిపారు. ప్రైవేటీకరణ కాకుండా సీఎం తన లేఖలో అయిదు ప్రత్యామ్నాయాలు సూచించారని పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలని, స్టీల్‌ప్లాంట్ నష్టాల నుంచి బయట పడేందుకు అన్ని అవకాశాలు ఉ



న్నాయని తెలిపారు. విశాఖ ఉక్కు తెలుగువారి ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని మరోసారి గుర్తుచేశారు.విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్ అన్నారు. 32 మంది ప్రాణాల బలిదానంతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు అయ్యిందని, స్టీల్‌ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ కేంద్రం కేటాయించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించాలని కోరారు. కాగా, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా గత కొన్ని రోజులుగా తీవ్ర ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే.

# సంపాదకీయం

శుక్రవారం 21 మే 2021

## పార్టీల ప్రయోజనాలేనా?ప్రజా సంక్షేమం పట్టదా?

కోవిడ్ కొరడా ఝుళిపిస్తోంది. దేశంలోని చాలా రాష్ట్రాలలో పార్టీలు పరస్పర విమర్శలతో రాజకీయ వైరస్ ను వ్యాపింప చేస్తున్నాయి. తమ పార్టీల ప్రయోజనాలే తప్ప ప్రజా ప్రయోజనాలు , చిత్తశుద్ధి ఎంతమాత్రం కనిపించడం లేదు. ప్రతిపక్షాల ఆరోపణల్లోని అసలు విషయాలను వదిలేసి అధికారపార్టీలు విరుచుకుపడుతు?న్నాయి. మీడియాకు ఇదంతా పెద్ద వినోదంగా మారింది. కరోనా విలయాన్ని రెండింతలు మూడింతలుగా కళ్లకు కట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న మీడియా మధ్య మధ్యలో పార్టీల విమర్శల వినోదాన్నీ పంచుతోంది. జాతీయంగానూ, రాష్ట్రాల స్థాయిలోనూ గడచిన నెల రోజులుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ఇది కాదు మార్గమంటూ కొన్ని రాష్ట్రాలు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. రెండు మూడు రాష్ట్రాల్లోని నాయకత్వం ప్రజల ప్రాణాల కంటే రాజకీయం ముఖ్యం కాదని నిరూపిస్తున్నాయి. వాటిని అనుసరించాలా? వద్దా ? అన్నది కేంద్ర ప్రభుత్వమూ, మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలూ ఆలోచించుకోవాలి. ప్రతిపక్షాలను సైతం కోవిడ్ కట్టడి విషయంలో కలుపుకుని పోవడం ద్వారా పటిష్ఠమైన సలహా యంత్రాంగాన్ని, నిఘాను పెంచుకోవడమే కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు అనుసరిస్తున్న పద్ధతి. అధికార, ప్రతిపక్సాలు కలిసి పనిచేస్తే ప్రభుత్వ యంత్రాంగమూ భయభక్తులతో ఉంటుంది. తాము కూడా జవాబుదారీ అన్న బాధ్యత ప్రతిపక్సాలపై పడుతుంది. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే లక్ష్యాన్ని దూరంగా పెట్టి తక్షణ కర్తవ్యం నిర్వహించడానికి అవకాశం ఉంటుంది.ఇటీవల కేరళలో ఎల్డీఎఫ్ కూటమి ఘన విజయాన్ని సాధించింది. నలభై సంవత్సరాలుగా యూడీఎఫ్, ఎల్డీఎఫ్ లు విడతల వారీగా అధికారంలోకి వస్తున్నాయి. ఆ సంస్కతికి చరమగీతం పాడుతూ రెండోసారి వరసగా ఎల్డీఎఫ్ అధికారం చేజిక్కించుకుంది. ముఖ్యమంత్రి విజయన్ వివిధ సందర్భాల్లో ప్రతిపక్ష యూడీఎఫ్ ను కలుపుకుని పోవడమే దీనికి ప్రధాన కారణం. వరదలు కావచ్చు. కోవిడ్ కావచ్చు. అన్నిటా ప్రతిపక్ష నేతను సైతం విశ్వాసంలోకి తీసుకుంటూ చర్యలు చేపట్టారు. ప్రతిపక్ష నాయకుడిని పక్కన కూర్చొపెట్టుకుని జాయింట్ గా ప్రజలకు విపత్కర పరిస్థితుల్లో సందేశాలు ఇచ్చారు. సలహా మండలిలో ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే మళయాళ మనోరమ అధినేతకు సైతం చోటు కల్పించారు. ఆయా చర్యల వల్ల విపక్షాల విమర్శల ధాటి తగ్గింది. అధికార యంత్రాంగంపై నిఘా పెరిగింది. రాజకీయంగానూ విజయన్ కు కలిసి వచ్చింది. మోడీ వంటి నేతలు ఈ ఆదర్శాన్ని ఆచరణలో పెడితే జాతీయంగా ప్రతిపక్షాల సహకారం పొందడానికి అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నిస్సహాయంగా చేతులెత్తేసిన పరిస్థితుల్లో అందరూ కలిసి నిర్మాణాత్మకంగాముందుకు వెళ్లడం ప్రజలకు నైతిక స్థైర్యం కల్పిస్తుంది.జయలలిత, కరుణానిధి హయాంలో ఏఐడీఎంకే, డీఎంకేలు కత్తులు దూసుకునేవి. అవి రెండూ శత్రు శిబిరాలే. ప్రజల మధ్య చీలిక పెట్టి పరిపాలించాలని చూస్తుండేవి. నాయకుల వ్యక్తిగత విద్వేషాలను ప్రజలకు అంటగట్టే వారు. హింసాత్మక చర్యలు, ప్రతీకార దాడులు చోటు చేసుకునేవి. అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రతిపక్సంపై పోలీసుల సహకారంతో నానారకాల వేధింపులకు పాల్పడుతుండేది. ఈ ధోరణికి ముఖ్యమంత్రి స్టాలిన్ వీడ్కోలు పలకడం ముదావహం. ఏఐడీఎంకేను ఓడించి అధికారంలోకి వచ్చినప్పటికీ గత ప్రభుత్వంలోని ముఖ్యులపై ఎటువంటి ప్రతీకార విచారణలు, దర్యాప్తులకు పూనుకోలేదు. ఇదొక సానుకూల సంకేతం. తాజాగా కరోనా కట్టడికి నియమించిన సలహా మండలిలో సైతం ప్రతిపక్సాలన్నిటికీ స్థానం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అన్నిపార్టీలకు కలిపి కొన్ని లక్షల మంది కార్యకర్తలు ఉంటారు. వారంతా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహాయ చర్యల్లో పాల్గొనవచ్చు. దానికంటే ముఖ్యంగా ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లు విమర్శనాత్మక కోణంలో కాకుండా ఆచరణాత్మక రీతిలో ప్రజలకు చేరుతున్నాయో లేదో పర్యవేక్షించవచ్చు. దీంతో సర్కారీ ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది.చెప్పడానికి గోవా చాలా చిన్న రాష్ట్రం. అయినా తన ప్రజల పట్ల చిత్తశుద్ధిని చాటుకోవడంలో పెద్ద మనసునే ప్రదర్శించింది. ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు వాటన్నిటినీ ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకుని వచ్చింది. ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయకుండా కట్టడి చేసింది. దీనివల్ల పడకలను బ్లాక్ చేసి పెట్టుకోవడానికి వీలుండదు. డబ్బున్న వారికి మాత్రమే ప్రయివేటు ఆసుపత్రులు నిలయంగా మారవు. అవసరమున్నా, లేకున్నా ధనికులు ముందు జాగ్రత్తగా ఆసుపత్రులను రిజర్వ్ చేసుకునే దోరణికి అడ్డుకట్ట పడింది. ప్రతి ఆసుపత్రిని ప్రభుత్వాధికారులు పర్యవేక్షించే ఏర్పాట్లు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ విపరీతంగా పెరిగిపోయింది. కరోనా కు కళ్లెం ఎప్పుడు పడుతుందో తెలియదు. ఈ లోపు ప్రయివేటు కార్పొరేట్ ఆరోగ్య వ్యాపారుల ధన దాహానికి ప్రజలు బలైపోతున్నారు. దేశ వ్యాప్తంగా అన్ని ఆసుపత్రులను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రభుత్వాలకు అంటువ్యాధుల నివారణ చట్టాలు అధికారం కల్పిస్తున్నాయి. ఇంతటి విపత్తులోనూ ప్రభుత్వాలు ఆమేరకు చర్యలు తీసుకోవడం లేదు. ఇది పరోక్షంగా వాటి వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నట్లుగానే పరిగణించాలి. రెమ్ డిసివర్లు, ఆక్సిజన్ సిలండర్లు, వాక్సిన్ల విషయంలో సంపూర్ణ మైన సంతృప్తి ప్రజలకు ఎప్పటిలోగా కలిగిస్తారో ప్రభుత్వాలు చెప్పలేక పోతున్నాయి. కనీసం తమకున్న అధికారాల పరిధిలో ప్రయివేటు దోపిడీని అయినా అరికడితే అదే పదివేలని భావిస్తున్నారు మధ్యతరగతి ప్రజలు.

# బీజేపీ ఉప ఎన్నికపై పోస్టుమార్టం

తిరుపతి, మే 20, (న్యూస్ పల్స్)తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల విషయంలో ఆ పార్టీ అభ్యర్థి రత్న ప్రభ తీవ్ర అసంతృప్తి?ని వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. కనీస ఓట్లను కూడా సాధించక పోవడం వెనక నేతల వైఫల్యమే కారణమని రత్న ప్రభ భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ కేంద్ర నాయకత్వానికి ఆమె నివేదిక పంపినట్లు సమాచారం. తనకు పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి పెద్దగా సహకారం అందలేదని, సమన్వయం కొరవడిందని రత్న ప్రభ ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో బీజేపీ పెద్ద ఆశలే పెట్టుకుంది. అందుకే ఆచితూచి అభ్యర్థి ఎంపికలోనూ అడుగులు వేసింది. సుదీర్ఘ మంతనాల తర్వాత రత్న ప్రభను ఎంపిక చేసింది. తెలుగుదేశం పార్టీ బలహీనపడిందని భావించిన బీజేపీ తమకు ఈసారి గెలవకపోయినా సెకండ్ ప్లేస్ లో ఉంటామని ఆశించింది. ఈ మేరకు దాదాపు నాలుగు నెలల ముందునుంచే ప్రయత్నాలు ప్రారంభించింది.తిరుపతి ఉప ఎన్నికను సీనియర్ నేత సునీల్ దేవ్ ధర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మాజీ ఐఏఎస్ అధికారి అయిన రత్నప్రభ ఎంపికలోనూ ఆయనే కీలక పాత్ర పోషించారు. అయితే నేతలు కేవలం మీడియాకు మాత్రమే పరిమితమయ్యారని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయలేకపోయారని రత్న ప్రభ భావిస్తున్నారు. నేతలందరూ తిరుపతి చుట్టూ తిరిగారని, కీలకమైన నియోజకవర్గాలను విస్మరించారంటున్నారు.జనసేన పార్టీతో పొత్తు ఉండటంతో కనీస ఓట్లు సాధిస్తామన్న నమ్మకం పెట్టుకున్నారు. అందుకే నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తిరుపతి ప్రచారానికి వచ్చిన జేపీ నడ్డా సయితం నేతల మధ్య సమన్వయం లేకపోవడాన్ని గుర్తించి వారిని మందలించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జేపీ నడ్డా యే స్వయంగా రత్న ప్రభను ఓటమికి గల కారణాలను తెలపాలని కోరినట్లు తెలిసింది. మొత్తం మీద తిరుపతి ఉప ఎన్నికలో దారుణ ఓటమి బీజేపీ నేతల భవిష్యత్ కు ఇబ్బందికరంగా మారనుంది.రాజకీయాలకు పనబాక దూరం తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల దెబ్బకు టీడీపీ అభ్యర్థి పనబాక లక్ష్మి రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారా? అంటే అవుననే చెబుతున్నారు. వరసగా రెండు ఎన్నికల్లో ఓటమి పాలు కావడం, పార్టీ నుంచి పెద్దగా సహకారం లేకపోవడంతో రాజకీయాల నుంచి వైదొలగడమే బెటర్ అని పనబాక లక్ష్మి కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత రాజకీయాల్లో ఇమడలేమని వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.ఇటీవల జరిగిన తిరుపతి ఉప ఎన్నికల్లో పనబాక లక్ష్మి పోటీ చేసేందుకు తొలుత నిరాకరించారు. అయితే చంద్రబాబు వత్తిడి చేసి ఆమెను పోటీకి దింపారు. ఫలితం ముందుగానే తెలిసిపోతుండటంతో పనబాక లక్ష్మి తొలినుంచి యాక్టివ్ గా లేరు. మూడు నెలల ముందు అభ్యర్థిగా ప్రకటించినా పనబాక లక్ష్మి పెద్దగా యాక్టివ్ గా లేరు. అందరికంటే ముందు ప్రచారాన్ని ప్రారంభించాలని చంద్రబాబు ఆదేశించినా ఆమె నిరాసక్తత కనపర్చారు.ఇక తిరుపత ఉప ఎన్నికల సందర్భంగా పార్టీ నేతలు సమన్వయంతో పనిచేయలేదని పనబాక లక్ష్మి చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. రాష్ట్ర స్థాయి నేతలు పనిచేసినప్పటికీ నియోజకవర్గాల్లో టీడీపీ బాధ్యులు పార్టీ ఇచ్చిన నిధులను కూడా

సక్రమంగా ఖర్చు చేయలేదని ఆమె చంద్రబాబుకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడంలో కూడా స్థానిక నాయకత్వం అశ్రద్ధ చూపెట్టారని పనబాక లక్ష్మి చెప్పినట్లు సమాచారం.ఇంత దారుణ ఓటమిని చవి చూస్తానని తాను అనుకోలేదని పనబాక లక్ష్మి చెప్పారు. చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు వంటి నేతలు తన విజయం కోసం శ్రమించినప్పటికీ స్థానిక నాయకత్వంపై పనబాక లక్ష్మి ఆగ్రహంగా ఉన్నారు. అందువల్లనే తాను రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నానని ఆమె చంద్రబాబుతో చెప్పినట్లు తెలిసింది. అయితే చంద్రబాబు మాత్రం గెలుపోటములు సహజమేనని, పునరాలోచించుకోవాలని కోరినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# కుదేలవుతున్న అనుబంధ రంగాలు

ఏలూరు, మే 20, (న్యూస్ పల్స్)లాక్‌డౌన్ ప్రభావం వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, ఆక్వా, పౌల్ట్రీలపై తీవ్రంగా పడింది. పాడి రైతులను ప్రభుత్వం మొత్తానికే విస్మరించగా, ఆక్వా, పౌల్ట్రీలపై హడావిడి తప్ప తక్షణ నిర్దిష్ట ఉపశమన చర్యలు నామమాత్రం. లాక్‌డౌన్ మొదలైన నాటి నుంచి పాలు, పౌల్ట్రీ, ఆక్వా ఉత్పత్తుల అమ్మకాలు, రవాణాపై ఆంక్షలు లేకున్నా ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో పోలీస్ శాఖ ఎక్కడికక్కడ వాహనాలను నిలిపేసింది. అనుమతులు, తనిఖీలంటూ దిగ్బంధించింది. చాలా రోజుల తర్వాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చినా, అప్పటికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అనుబంధ రంగాల్లో అత్యంత ప్రధానమైనది, కోట్ల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నది పాడి రంగం. దాదాపు 40 లక్షల మంది పాడి రైతులు రాష్ట్రంలో ఉన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఉన్నారు. కరువు కాటకాలచ్చి వ్యవసాయం స్తంభించినా, కూలీలకు పనులు లేకపోయినా అన్ని కాలాల్లో పాడి రంగం కొంత వరకు గ్రామీణ ఉపాధికి గ్యారంటీ ఇస్తోంది. ఎపిలో 47 లక్షల ఆవులు, 64 లక్షల బర్రెలు ఉన్నాయి. సంవత్సరానికి 150 లక్షల టన్నుల పాల ఉత్పత్తి జరుగుతోంది. ప్రతి రోజూ సగటున 1.52 కోట్ల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. కోటి లీటర్లను చిన్నా చితకా 57 ప్రైవేటు డెయిరీలు సేకరిస్తుండగా, తతిమ్మా 52 లక్షల లీటర్లను సహకార డెయిరీలు సేకరిస్తున్నాయి. మామూలు రోజుల్లో లీటరు గేదె పాలకు రూ.35-40, ఆవు పాలకు రూ.20-25 వంతున రైతులకు చెల్లిస్తున్నాయి. ప్రాసెస్ చేసిన లీటర్ పాలను వినియోగదారులకు రూ.55కు అమ్ముతున్నాయి. ఇతర పాల ఉత్పత్తులను కూడా కలుపుకుంటే లీటర్‌పై సగటున రూ.20 లాభం పొందుతున్నాయి. దానిలో కనీసం రూ.10 పాడి రైతులకు దక్కేలా చూడాలన్న డిమాండ్ ఉంది. లాక్‌డౌన్‌లో గ్రామాల్లో పాల సేకరణ, రవాణాకు ఇబ్బందులేర్పడ్డాయి. హోటళ్లు, రెస్టారెంట్లు లేకపోవడంతో పాల రైతులు అనివార్యంగా కంపెనీలను ఆశ్రయించాల్సి వచ్చింది. దాంతో ఇంకా ధరలు తగ్గించాయి. అవి మాత్రం లీటర్ పాలను రూ.5 పెంచి రూ.60కి అమ్ముతున్నాయి. లాక్‌డౌన్ వలన పశువుల దాణా అందుబాటులో లేదు. ఉన్నా ధరలు పెరిగాయి. ఒక వైపు ఖర్చులు పెరగ్గా, మరో వైపు సేకరణ ధరలు తగ్గడంతో పాడి రైతులు మరింతగా ఆర్థిక నష్టాలు చవి చూస్తున్నారుపౌల్ట్రీ రంగంలో సన్న, చిన్నకారు, మధ్యతరగతి పెంపకందార్లే అధికం. ఏడాదిలో రెండు వేల కోట్ల కోడిగుడ్లు, 8 లక్షల టన్నుల చికెన్ ఉత్పత్తి జరుగుతోంది. సాధారణంగా వేసవిలోనే పౌల్ట్రి ఉత్పత్తులకు గిరాకీ ఉంటుంది. అదే సమయంలో లాక్‌డౌన్ రావడంతో అమాంతం పౌల్ట్రి దెబ్బ తింది. రవాణా సదుపాయాల్లేక పోవడం, మార్కెట్లు బంద్ కావడంతో రోజువారీగా ఉత్పత్తి అయిన గుడ్లు వృధా అయ్యాయి. పైపెచ్చు చికెన్, గుడ్లు తింటే కరోనా వ్యాపిస్తుందన్న ప్రచారంతో జనం ఆ వైపు చూడలేదు. చాలా చోట్ల గుడ్లు, చికెన్, కోళ్లను ఉచితంగా పంపిణీ చేసినా తీసుకోలేదు. వదంతులపై ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రజల్లో అవగాహన కల్పించడంలో విఫలమైంది. ఇప్పుడిప్పుడే చికెన్, గుడ్లకు డిమాండ్ పెరగ్గా, మధ్య దళారీలు వాటి ధరలను అమాంతం పెంచేశారు.ఎపిలో ఆక్వా 1.40 లక్షల హెక్టార్లలో సాగవుతోంది. రిజిస్ట్రేషన్లు లేకుండా అనధికారికంగా మరో 40 వేల హెక్టార్లలో సాగవుతున్నట్లు అంచనా. ఏడాదిలో 32 లక్షల టన్నుల చేపలు, రొయ్యల ఉత్పత్తి జరుగుతోంది. దీనిలో అత్యధిక భాగం ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఆక్వా సాగు జూదంగా మారింది. రొయ్యలకు వైట్‌స్పాట్ వంటి వైరస్‌లచ్చిన సందర్భాల్లో రైతులు నష్టపోతున్నారు. రెండు మూడేళ్లుగా మన రొయ్యలను విదేశాలు తిరస్కరిస్తున్నాయి. కెమికల్స్ అధికంగా వాడుతున్నారని అభ్యంతరపెడుతున్నాయి. ఆ సమస్య ఉండగానే లాక్‌డౌన్ వచ్చింది. దీంతో ఎగుమతులు నిలిచిపోయాయి. రైతులకు ధరలు దిగజారాయి. రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా మద్దతు ధరలు (ఎంఎస్‌పి) ప్రకటించినా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. ప్రాసెసింగ్ యూనిట్లను తెరిపిస్తామన్నా ఆచరణ సాధ్యం కాలేదు. ఎగుమతులు జరుగుతున్నాయని ప్రచారం సాగుతున్నా రోజుకు 500 లారీలకు 50 కూడా వెళ్లట్లేదని స్వయాన సంబంధిత మంత్రే పేర్కొన్నారు. సరైన కోల్డ్ స్టోరేజీలు లేక, స్థానిక మార్కెట్‌లో తక్కువకు అమ్మలేక ఆక్వా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇక పట్టు పురుగుల పరిశ్రమ సైతం దెబ్బతింది. పట్టు పురుగులు బయటికొస్తున్నాయి. రవాణా లేక రైతులు నష్టపోయారు.

# బద్వేలు కు టీడీపీ దూరం

కడప, మే 20, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో మరో ఉప ఎన్నిక రాబోతుంది. బద్వేలు నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యం. ఎన్నిక ఆరు నెలల్లోపు జరగాల్సి ఉంది. ఇక్కడ వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ వెంకటసుబ్బయ్య మృతితో ఉప ఎన్నిక జరగనుంది. అయితే జగన్ ఆ కుటుంబంలోని వారికే ఉప ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తామని ప్రకటించారు. దీంతో బద్వేల్ బరిలో ఉండాలా? లేదా? అన్నది టీడీపీలో చర్చనీయాంశంగా మారింది. తిరుపతి ఉప ఎన్నిక ఫలితంతో బద్వేలు ఎన్నికకు దూరంగా ఉండాలని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు.బద్వేలు కడప జిల్లాలోనిది. వైఎస్ జగన్ కుటుంబానికి పట్టున్న ప్రాంతమది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కడప జిల్లాలో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. గత ఎన్నికల్లోనూ వైసీపీకి బద్వేలు లో ముప్ఫయి వేల మెజారిటీకి పైగానే వచ్చింది. ఇక్కడ టీడీపీ గెలుపు గుర్రం ఎక్కడం కష్టమే. ఇది కూడా రిజర్వ్ నియోజకవర్గం కావడంతో వైసీపీ?కి ఈ ఎన్నిక కూడా అడ్వాంటేజీగా ఉంటుంది. వరస ఓటముతో డీలా పడిఉన్న తెలుగుదేశం పార్టీకి మరో ఎన్నికకు సిద్ధమవ్వాలా? లేదా? అన్న సందిగ్దంలో పడిపోయారు.తిరుపతి ఉప ఎన్నిక వస్తుందని తెలిసే నాటికి ఏపీలో ఎలాంటి ఎన్నికలు జరగలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరగకపోవడంతో చంద్రబాబు వెంటనే తిరుపతిలో పార్టీ అభ్యర్థిని ప్రకటించారు. కానీ ఇప్పుడు చూస్తే టీడీపీ అన్ని ఎన్నికల్లో చేదు అనుభవం ఎదురయింది. ఈ పరిస్థితుల్లో బద్వేలులో పోటీకి దూరంగా ఉండటమే మేలన్న భావన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మరణించారు కాబట్టి పోటీకి దూరంగా ఉండటమే మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి.ఇటీవల చంద్రబాబు కడప జిల్లా నేతలతో ఈ విషయమై చర్చించినట్లు తెలిసింది. వారు కూడా పోటీకి దూరంగా ఉండటమే బెటరని సూచించినట్లు చెబుతున్నారు. అయితే టీడీపీ పలుసార్లు బద్వేలు నియోజకవర్గం నుంచి విజయం సాధించింది. 1983, 1985, 1994, 1999 లలో నాలుగు సార్లు టీడీపీ గెలిచింది. దీంతో పోటీకి దిగి తమ ఓటు బ్యాంకు చెక్ చేసుకోవడమే మంచిదని చంద్రబాబు భావిస్తున్నారు. మొత్తం మీద బద్వేలు ఉప ఎన్నికపై చంద్రబాబు డైలమాలో ఉన్నారని చెబుతున్నారు.

# పశ్చిమలో కోలుకోనేది ఎలా

ఏలూరు, మే 20, (న్యూస్ పల్స్)ప్రధాన ప్రతిపక్షం టీడీపీకి బలంగా ఉన్న జిల్లా పశ్చిమ గోదావరి. 2014లో క్లీన్ స్వీప్ చేసిన తర్వాత మరింతగా బలం పుంజుకుంటుందని భావించినా 2019 ఎన్నికల్లో మాత్రం పార్టీ జిల్లాలో రెండు సీట్లకు పరిమితం అయ్యింది. మెట్ట ప్రాంతంలో జిల్లా కేంద్రంగా ఉన్న ఏలూరులో ఇటు ఎంపీ, అటు ఎమ్మెల్యే స్థానాల్లోనూ టీడీపీ ఓడిపోయింది. అయితే.. ఎన్నికలు జరిగిన కొద్దికాలానికే మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి హఠాన్మరణం చెందారు. ఇక్కడ బుజ్జి సోదరుడు బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కు అవకాశం కల్పించారు. అయితే బుజ్జిలో ఉన్న దూకుడు ఇప్పుడు చంటిలో కనిపించడం లేదు. బుజ్జి మరణాంతరం సానుభూతి వర్కవుట్ అవుతుందనే చంద్రబాబు ఆయన సోదరుడికి నియోజకవర్గ పగ్గాలు ఇచ్చినా ఆయన అక్కడ టీడీపీని ఎంత వరకు నడిపిస్తారన్న దానిపై పార్టీ నేతల్లోనే అనేక సందేహాలు ఉన్నాయి. అక్కడ డిప్యూటీ సీఎంగా ఉన్న ఆళ్ల నానిని తట్టుకుని కేడర్‌ను నిలబెట్టే పరిస్థితి లేదు.ఇక, పార్లమెంటు స్థానంలో రెండున్నర దశాబ్దాలకు పైగా పాతుకుపోయిన మాజీ మంత్రి, మాజీ ఎంపీ మాగంటి బాబు 2019 ఎన్నికల్లో మాత్రం ఓడిపోయారు. దీనికితోడు అనారోగ్య కారణాలతో ఆయన పార్టీకి దూరంగా ఉన్నారు. ఇక,ఇక్కడ నుంచి ఆయన తనకుమారుడు రాంజీని రాజకీయంగా నిలబెట్టాలని అనుకున్నా ఆయన ఆకస్మికి మరణంతో ఏలూరులో టీడీపీకి బలమైన నాయకుడు అంటూ లేకుండా పోయాడు. దీంతో ఇప్పుడు పార్లమెంటు స్థానంలోను, అసెంబ్లీ స్థానంలోనూ పార్టీ పరిస్థితి ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఈ రెండు చోట్ల వచ్చే ఎన్నికల నాటికి గెలుపు మాట అటుంచితే టీడీపీని నిలబెట్టేందుకు కూడా బలమైన నేతలు లేని దుస్థితిలో టీడీపీ ఉంది.మరో మూడేళ్ల తర్వాత వచ్చే ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థిపై కసరత్తు జరగాలని ఇప్పటి నుంచే నేతలు కోరుతున్నారు. బడేటి చంటి ఏలూరు ఇన్‌చార్జ్‌గా ఉన్నా ఆశించిన విధంగా పార్టీలో దూకుడు చూపించలేక పోవడం ప్రధానంగా మైనస్ అయిపోయింది. చంద్రబాబు అనేక కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినా.. ఈయన నామ్ కే వాస్తే.. న్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో పార్టీ ఓడిపోతుందని ముందే డిసైడ్ అయిన చంటి ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదు.పార్లమెంటు పరిధిలోకి వస్తే.. వచ్చే ఎన్నికల నాటికి మాగంటి బాబు కూడా తప్పుకొనే పరిస్థితి కనిపిస్తోంది. వాస్తవానికి గత ఎన్నికల్లోనే ఆయన తప్పుకుందామని అనుకున్నారు.కానీ, అప్పట్లో చంద్రబాబు ఒత్తిడి తెచ్చి.. పోటీకి పెట్టారని ప్రచారం జరిగింది. సో.. ఇప్పుడు ఈయన కూడా టీడీపీ తరఫున పోటీకి దిగే పరిస్థితి లేదు. ఓవరాల్‌గా చూస్తే జిల్లా కేంద్రంలో ఈ రెండు స్థానాలకు ఇద్దరు బలమైన నేతలను వెతకాల్సిన బాధ్యత బాబుపై ఉంది. లేనిపక్షంలో ఇక్కడ పార్టీ బతికే పరిస్థితి లేదని పార్టీ నేతలు గగ్గోలు పెడుతున్నారు.

# చితికిపోతున్న చిన్న వ్యాపారులు

శ్రీకాకుళం, మే 20, (న్యూస్ పల్స్)కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ కారణంగా చిరు వ్యాపారుల జీవనాధారం అగమ్యగోచరంగా మారింది. ఎంతోమంది చిరు బతుకులు రోడ్డున పడ్డాయి. పురుషునితో సమానంగా కష్టపడితే గానీ అతి కష్టంగా సాగే కుటుంబ పోషణకు మహిళలు తన వంతు బాధ్యతగా కూరగాయలు, పండ్లు, చేపలు, కొబ్బరికాయలు వంటి పలు రకాల చిరు వ్యాపారులను చేస్తున్నారు. సాధారణ రోజుల్లో వారు పడిన కష్టానికి పెట్టుబడి, ఇతర ఖర్చులు పోనూ సుమారు రూ.300 నుంచి రూ.350 వరకు మిగిలేది. లాక్ డౌన్ కారణంగా ప్రభుత్వం విధించిన ఆంక్షల మేరకు ఉదయం 10 గంటల వరకు మాత్రమే సమయం కేటాయించడంతో వ్యాపారాలు సాగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టడమే తప్ప లాభాలు ఉండడంలేదని చెబుతున్నారు. ముఖ్యంగా అమ్మకాలకు సమయం తక్కువగా ఉండడమే దీనికి ప్రధాన కారణంగా వారు చెబుతున్నారు. మగవారికి పనులు లేక పోవడంతో దినసరి ఆదాయం లేక ఇంటిల్లిపాది కూర్చొని తినడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై నూడిల్స్, పానీ పూరి, సరబత్, టీ, లస్సీ, పకోడీ తదితర చిరుతిండ్లు వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారందరూ పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. ఈ వ్యాపారాలు ఎక్కువగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు సాగేవి కావడంతో పూర్తిగా మూతపడి నట్లయింది. దీంతో బతుకు భారమై నేల చూపులు చూసే పరిస్థితి వచ్చింది. సామాజిక స్పృహతో పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు సమయానుకూలంగా చేదోడు వాదోడుగా నిలుస్తున్నప్పటికీ అది అంతా తాత్కాలికమేనని ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందిస్తే తప్ప వారు కోలుకునే పరిస్థితి కానరావడంలేదు. కరోనా వ్యాప్తి మరణాల కన్నా ఆర్థిక ఇబ్బందులతో ఆకలి చావులే అధికమయ్యేటట్లుగా కనిపిస్తున్నాయని పలువురి నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది.

# జగన్ కేసులపై దృష్టి...

విజయవాడ, మే 20, (న్యూస్ పల్స్)ఏపీలో తెలుగుదేశం పార్టీ సంగతి అందరికీ తెల్సిందే. ఘోరాతిఘోరంగా ఎన్నికల్లో ఓడిపోతున్నా పార్టీగా వాడిపోతున్నా కూడా చంద్రజాలంతో ఎప్పటికపుడు జగన్ మీద రాజకీయంగా పై చేయి సాధించేందుకు బాబు రెడీ అవుతూనే ఉన్నారు. ఆయనకు వ్యవస్థలలో ఉన్న పలుకుబడి పరిచయాలు వ్యూహాలు కూడా ఇలా పనికివస్తున్నాయి అని చెప్పాలి. మరి దూకుడే వ్యూహంగా మార్చుకుని ముందుకు సాగే జగన్ బాబుని ఎదుర్కోవడం అంటే చాలా కష్టమే. కానీ రెండేళ్ల సీఎం గా జగన్ ఈ విషయంలో బాగానే సక్సెన్ అయ్యారనుకోవాలి.ఏపీకి కేంద్రం నుంచి ఏం ఒరిగింది అని అంతా అంటారు. ఆ విషయం పక్కన పెడితే జగన్ కి కేంద్రంలోని పెద్దలకు మధ్య సంబంధాలు చాలా బాగా ఉన్నాయని అంతా అంటారు. జగన్ ఎంతగా జోరు చూపించినా ఆయనకు బాబు అడుగడుగునా బ్రేకులు వేస్తున్నా కూడా నెట్టుకుని వచ్చే నేర్పు వెనక కేంద్ర పెద్దలు ఉన్నారని అంటారు. కేంద్రంలోని మోడీ అమిత్ షాలకు ఏపీలో బాబు మీద పెద్దగా నమ్మకం లేదు అని చెబుతారు. పైగా బాబు 2019 ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇతర విపక్షాలతో అంటకాగడాన్ని వారు కళ్లారా చూశాక ఇక మనసు మార్చుకుంటారు అనుకుంటే పొరపాటే అన్న మాట ఉంది.ఇక మరో వైపు చూస్తే జగన్ని ఎలాగైనా జైలుకు పంపాలని చంద్రబాబు వేయని ఎత్తులు లేవు అంటారు. వీలు దొరికితే చాలు జగన్ కేసుల మీదనే ఆయన దృష్టి సారిస్తారు అంటారు. తాజాగా వైసీపీ ఎంపీ రఘురామ క్రిష్ణం రాజు జగన్ కి వ్యతిరేకంగా మాట్లాడడం కాదు, ఏకంగా ఆయన బెయిల్ రద్దు చేయాలంటూ కోర్టులో కేసు వేశారు. అయితే ఇక్కడే కొన్ని రాజకీయ చిత్రాలు జరుగుతున్నాయని చెప్పాలి. కౌంటర్ దాఖలు చేయడానికి ఒక వైపు జగన్ తరఫున న్యాయ వాదులు గడువు కోరుతూంటే సీబీఐ తరఫున కూడా న్యాయవాదులు గడువు కోరడమే ఆ చిత్రం. ఒక విధంగా జగన్ బెయిల్ పిటిషన్ విషయంలో ఏదో జరుగుతుందీ అన్న చర్చ నుంచి ఏం జరగనుంది అన్న దాకా కథ నడుస్తోంది అంటే తెర వెనక ఏమైనా మతలబు ఉందా అన్నదే సందేహం.ఇదిలా ఉంటే వైసీపీ ఎంపీ రఘురామ క్రిష్ణం రాజు అరెస్ట్ ఏపీ రాజకీయాల్లో అతి పెద్ద రచ్చగా మారింది. దీని మీద కేంద్రం జోక్యం చేసుకోవాలంటూ రఘురామ కుటుంబ సభ్యులు కూడా కేంద్రానికి లేఖ రాసారు. అయితే సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రఘురామ అరెస్ట్ తతంగమంతా కేంద్ర మంత్రి అమిత్ షా అనుమతితోనే జరిగింది అని తాజాగా అంటున్నారు. జగన్ కి బీజేపీ సహకారం ఉంది అని అర్థం వచ్చేలా ఆయన ఈ కీలక కామెంట్స్ చేస్తున్నారు. మరి అదే నిజం అనుకుంటే రఘురామ ఫక్త్ బీజేపీ మనిషిని అని చెప్పుకుంటున్నారు కదా. తేడా ఎక్కడ వచ్చింది. బీజేపీ జగన్ కి ఎందుకు మద్దతుగా ఉంటుంది.

## కోవిడ్ బాధితులను ఆదుకునేందుకు ముందుకు వస్తున్న దాతలు

రాజమండ్రి కోవిడ్ బాధితులను ఆదుకునేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వస్తున్నారని ఎంపి, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ భరత్ రామ్ తెలిపారు. రాజన్న రచ్చబండ కార్యక్రమం అనంతరం మీడియాతో ఎంపి భరత్ రామ్ మాట్లాడుతూ ఫేస్ బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా తాను నిర్వహిస్తున్న రాజన్న రచ్చబండ కార్యక్రమాలకు పలువురు స్పందిస్తున్నారన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు 'నేను సైతం ' అంటూ సహాయం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.

# పరీక్షల విషయంలో లోకేష్ సక్సెస్..



గుంటూరు, మే 20,(న్యూస్ పల్స్)మహా మంత్రి తిమ్మరుసు సమయస్ఫూర్తి రాజకీయ నాయకులకు ఎపుడూ ఆదర్శమే. ఒకరిని చిన్నగా చూపించాలంటే వారి కంటే మరొకరిని తెచ్చి పెద్దగా చూపిస్తే చాలు. ఆటోమెటిక్ గా చూసే కళ్లకు మొదటి వారు చిన్నగా కనిపిస్తారు. ఇపుడు తెలుగుదేశం రాజకీయాలలో చినబాబు నారా లోకేష్ బాగా చిన్నగా కనిపిస్తున్నారు. ఇక టీడీపీలో ఎందరో సీనియర్లు కూడా ఉన్నారు. అలాగే ఆరో వేలు లాంటి ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ పోస్ట్ కూడా ఉంది. అందులో కుదురుకున్న అచ్చెన్నాయుడు పాతికేళ్ల రాజకీయ అనుభవం ఉన్న నేత. పైగా బీసీ నాయకుడు.ఇదిలా ఉంటే ఇంటర్, టెన్త్ పరీక్షల మీద ఏపీలో పెద్ద ఎత్తున రాద్ధాంతం జరిగిన సంగతి విదితమే. అన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా కరోనా వేళ పరీక్షలు ఏంటి అని గర్జించాయి. వాటి కంటే ముందు ఈ విషయాన్ని కదిపి కుదిపి రచ్చ చేసిన వారు నారా లోకేష్. చినబాబు తాపీగా రాసిన ఒక లేఖ ఏపీలో అగ్గిని రాజేసింది. విద్యాశాఖ అధికారులతో జగన్ సమావేశం ఉంటుందని, అందులో పరీక్షల మీద కీలక నిర్ణయం తీసుకోబోతున్నారు అని తెలిసే నారా లోకేష్ లేఖ రాసి పొలిటికల్ మైలేజ్ కి పక్కాగా ప్లాన్ చేశారు. లోకేష్ లేఖతో జగన్ సర్కార్ కూడా మొదట్లో పట్టుదలకు పోయింది. అయితే విపక్షాలు అన్నీ ఏకం కావడంతో పాటు కరోనా కేసులు పెరగడంతో ఎట్టకేలకు పరీక్షలు వాయిదా వేయక తప్పింది కాదు. దీంతో ఈ మొత్తం క్రెడిట్ లోకేష్ ఖాతాలో పడింది.ఇక పరీక్షల రద్దు విషయంలో నారా లోకేష్ ని ముందుంచి బాబు రాజకీయమాడారని చెబుతారు. పార్టీలో మరో నేత దీని మీద డిమాండ్ చేయకుండా టోటల్ గా లోకేష్ నే ఫోకస్ లో పెట్టారు. దాంతో లోకేష్ జూమ్ యాప్ మీటింగ్ ని పేరేంట్స్ తో పెట్టడం నుంచి సర్కార్ మీద విమర్శల జడివానను ఎప్పటికపుడు కురిపిస్తూ ఒక్కసారిగా పొలిటికల్ జోరు చేశారు. ఈ మొత్తం ఎపిసోడ్ లో ఎక్కడా ఏపీ ప్రెసిడెంట్ అచ్చెన్నాయుడు కనిపించలేదు. అంటే చినబాబు ఒక్కరే దీన్ని హ్యాండిల్ చేయడం ద్వారా బహు మొనగాడు అనిపించుకున్నారు అన్న మాట. అలా జగన్ సర్కార్ మీద తొలి విజయం సాధించాడు నారా లోకేష్ అంటూ ఆయన టీమ్ తెగ మురిసిపోతోంది.మధ్యన తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల ప్రచారంలో నారా లోకేష్ సరిగ్గా ఉంటే పార్టీకి ఈ పరిస్థితి వస్తుందా అంటూ అచ్చెన్నాయుడు అన్న మాటలతో వీడియో విడుదల అయింది. అది పెను సంచలనం రేకెత్తించింది. దాంతో లోకేష్ కంటే అచ్చెన్నాయుడే టీడీపీలో వెరీ స్ట్రాంగ్ అన్న భావన వెళ్ళిపోయింది. దాని వమ్ము చేసేందుకు,సీనియర్లు సహా మరెవరూ పెదవి విప్పకుండా ఉండేందుకు చినబాబు రాజకీయ కౌశలానికి ఇంటర్ పరీక్షలు పెట్టించారు చంద్రబాబు అన్న మాట. పైగా ఇంతకు ముందు టీడీపీ పెద్దలు ఎన్ని డిమాండ్లు చేసినా వైసీపీ సర్కార్ అసలు పట్టించుకోలేదు, కానీ నారా లోకేష్ డిమాండ్ తో ఏకంగా పరీక్షలు వాయిదా వేశారు, చూశారా చినబాబు సామర్ధ్యం ఇదీ అంటూ గొప్పగా చెప్పుకోవడానికి కూడా దీన్ని వాడుకుంటున్నారుట. మరి దీనితో అచ్చెన్నాయుడు హవాకు కూడా ఇలా చెక్ పెట్టారు అన్నది పసుపు పార్టీలో వినిపిస్తున్నతాజా మాట. ఫ్యూచర్ లో ఏం జరుగుతుందో చూడాల్సిందే.

## కాకాణి మంత్రి పదవి ఖాయమంట

నెల్లూరు, మే 20, (న్యూస్ పల్స్)చంద్రబాబు ఎవరిని టార్గెట్ చేస్తే జగన్ వారిని దగ్గరకు తీసుకుంటారు. ఇది గత కొంతకాలంగా అందరూ గమనిస్తున్న విషయమే. అందుకే చంద్రబాబు కు టార్గెట్ అవ్వాలని వైసీపీలోని అనేక మంది నేతలు ప్రయత్నిస్తుంటారు. అలాగే పవన్ టార్గెట్ చేసిన వారికి కూడా జగన్ అందలం ఎక్కిస్తారు. దీంతోపాటు సామాజిక సమీకరణాలు కూడా చూస్తారనుకోండి. ఇప్పుడు ఈ జాబితాలో కాకాణి గోవర్ధన్ రెడ్డి చేరారంటున్నారు.గతంలో పవన్ కల్యాణ్ కన్నబాబును టార్గెట్ చేశారు. కాకినాడ వెళ్లి మరీ కన్నబాబుపై వ్యక్తిగత విమర్శలు చేసేవారు. అదే కన్నబాబును జగన్ తన మంత్రివర్గంలో చోటు కల్పించి అత్యంత ప్రాధాన్యత కల్పించారు. ఇక చంద్రబాబు టార్గెట్ లో ఉన్న కొడాలి నానిని కూడా జగన్ దగ్గరకు తీసుకున్నారు. చంద్రబాబు విమర్శలకు జగన్ సత్కారాలతో వారికి చెక్ పెట్టేస్తారనే టాక్ వైసీపీలో బలంగా ఉంది.తిరుపతి ఉప ఎన్నికల పుణ్యమా అని వైసీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి హైలెట్ అయ్యారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై చంద్రబాబు, నారాలోకేష్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వంటి వారు లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ కాకాణి గోవర్ధన్ రెడ్డి కోట్లు గడిస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. ఇక మత్స్యకారులను ఆకట్టుకునేందుకు 43 కోట్లు విడుదల చేస్తూ జీవో తెచ్చారంటూ లోకేష్ కాకాణిపై విరుచుకుపడ్డారు. తిరుపతి ఉప ఎన్నికలో ప్రచారం ఎలా ఉన్నా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాత్రం మూడు నాలుగు రోజులు వార్తల్లో నేత అయిపోయారు.దీంతో కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఈసారి మంత్రి వర్గ విస్తరణలో చోటు ఖాయమంటూ వైసీపీలో ప్రచారం జరుగుతుంది. నిజానికి కాకాణి గోవర్ధన్ రెడ్డి సీనియర్ నేత. తొలి నుంచి జగన్ ను నమ్ముకున్న లీడర్. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఈసారి ఆయనకు జగన్ ఛాన్స్ ఇస్తారని అందరూ భావిస్తున్న తరుణంలో చంద్రబాబు, లోకేష్ చేసిన విమర్శలు మరింత అవకాశం పెంచినట్లయిందంటున్నారు. సో.. కాకాణి ఈసారి కేబినెట్ మినిస్టర్ ఖాయమట.

## టీడీపీ నేతలకు ఆర్థిక కష్టాలు

విజయవాడ, మే 20, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పార్టీ నేతలను కట్టడి చేయలేకపోతున్నారు. అసలే 2019 ఎన్నికల్లో షాక్ తో ఉన్న నేతలు వరస ఓటములతో బాగా డీలాపడిపోయారు. వరసగా వచ్చిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ చాలా మంది దూరంగా ఉన్నారు. ఆర్థికంగా బలమైన ఉన్న నేతలనే బరిలోకి కొందరు దింపారు. మరికొందరు కరోనా పేరుతో ఎవరినీ దగ్గరకు రానివ్వలేదు. ఈ విషయాన్ని కొందరు కేంద్ర పార్టీ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.అయితే చంద్రబాబు ఈ మధ్య నేతలతో జరిపిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. అయితే నేతలు అందుకు ధీటుగానే సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. తాము గత ఎన్నికలకు చేసిన అప్పుల నుంచే ఇంకా కోలుకోలేదని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ వ్యాపారాలన్నీ బంద్ అయ్యాయని కూడా కొందరు చెప్పారు. తాము హైదరాబాద్ లో ఉంటూ వ్యాపారాలు చూసుకుంటున్నామని గుంటూరు జిల్లాకు చెందిన ఒక నేత చెప్పినట్లు తెలిసింది.మూడేళ్ల ముందు నుంచే నియోజకవర్గంలో పార్టీని నడపాలంటే తమ శక్తి సరిపోదని కొందరు సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ఒకటిన్నర సంవత్సరం ముందు మాత్రమే తాము నియోజకవర్గంలో యాక్టివ్ గా కార్యక్రమాలు చేపడతామని, అప్పటి వరకూ అడపాదడపా నియోజకవర్గాన్ని పర్యటిస్తామని తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో చంద్రబాబు అలా అయితే ఎలా కుదురుతుంది? ప్రజల్లో ఉంటేనే కదా? వచ్చే ఎన్నికల్లో గెలిచేది అని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.దీంతో చంద్రబాబు నేతల్లో భయం పోయిందని గ్రహించారు. దీంతో కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాల్సి వస్తుందని, టీడీపీలో నేతలకు కొరత లేదని చంద్రబాబు ఒకింత గట్టిగానే చెప్పినట్లు తెలిసింది. కరోనా తగ్గిన వెంటనే నియోజకవర్గాల్లో యాక్టివ్ గా లేని నేతలను తాను ఉపేక్షించబోనని, ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి ఉంటుందని చంద్రబాబు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. కాని నేతలు మాత్రం బాబు వార్నింగ్ ను లైట్ గానే తీసుకున్నారట. మొత్తం మీద చంద్రబాబు అంటే నేతలకు భయంలేకుండా పోయిందన్న టాక్ పార్టీలో గట్టిగా వినిపిస్తుంది.

# ఆధునిక వైద్యానికి సవాల్...

**పెను సంచలనం సృష్టిస్తున్న కృష్ణ పట్నం ఆయుర్వేద మందు...**

**ఒక్క పైసా కూడా తీసుకోకుండా మందులు అందిస్తున్న బొణిగి ఆనందయ్య**

నెల్లూరు మే 20 నెల్లూరు జిల్లా, ముత్తుకూరు మండలం కృష్ణ పట్నం లో ఉచితంగా ఇస్తున్న ఆయుర్వేద మందు ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా చుట్టుపక్కల రాష్ట్రాలలో కూడా పెను సంచలనం సృష్టిస్తోంది.కరోనా ఏ స్థాయిలో ఉన్నా కేవలం రెండు రోజుల్లోనే నెగెటివ్ రావడం, సిటి స్కాన్ లో చెస్ట్ సివియారిటీ స్కోర్ 24/25 ఉన్నా కేవలం రెండు రోజుల్లోనే 0 కి రావడం, ఆక్సిజన్ అందక తీవ్ర విషమ పరిస్థితుల్లో ఉన్న వారు కూడా ఒక్కరోజులో లేచి కూర్చోవడం పెను సంచలనం సృష్టిస్తోంది.సోషల్ మీడియాలో గత మూడు రోజులుగా ఈ విషయం పెను దుమారం రేపడంతో కేరళ, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో అందరి దృష్టి ఒక్కసారి గా కృష్ణపట్నం పైకి మళ్ళింది.ఒక్క పైసా డబ్బు తీసుకోకుండా ఒక్కరోజు లోనే ఎంత తీవ్రమైన కేసైనా, తగ్గిపోవడం, ఎంత తీవ్రంగా కరోనా ఉన్నా కేవలం రెండు రోజుల్లోనే నెగెటివ్ రావడం, కార్పొరేట్ ఆసుపత్రులు చేతులెత్తేసిన కేసులు కూడా రెండు రోజుల్లోనే తగ్గిపోవడం, ఇంత వరకు ఈ వైద్యం పై ఒక్క రిమార్క్ కూడా రాకపోవడంతో వేలాది మంది కృష్ణ పట్నానికి క్యూ కట్టడానికి ప్రధాన కారణం అని తెలుస్తోంది.ఏది ఏమైనప్పటికీ 25 లక్షలు ఖర్చు చేసిన ఏ మాత్రం గ్యారంటీ ఇవ్వని కార్పొరేట్ ఆసుపత్రులు కంటే ఒక్క పైసా తీసుకోకుండా రెండు రోజుల్లోనే నెగెటివ్ తెప్పిస్తామని భరోసా ఇస్తున్న ఆయుర్వేద వైద్యులు మనలాంటి సామాన్యులకు దేవుడితో సమానం అని అనడం అతిశయోక్తి కాదు. కృష్ణపట్నం గ్రామంలో బొణిగి ఆనందయ్య, తన మిత్రులతో కలిసి కరోనా నివారణకు మరియు కరోనా సోకిన వారికి ఆయుర్వేద వైద్యం అందిస్తున్నారు.బొణిగి ఆనందయ్య, తన మిత్రులతో అందిస్తున్న ఆయుర్వేద మందుకు సంబంధించి ఒక్క పైసా కూడా డబ్బులు తీసుకోకుండా ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవాభావంతో మందులు అందిస్తున్నారు.ఆనందయ్య అందిస్తున్న మందు వల్ల వినియోగించిన వారిలో ఇప్పటివరకు సత్ఫలితాలు తప్ప, ఎక్కడా దుష్ప్రభావం చూపలేదు. ఆనందయ్య అందిస్తున్న మందు గురించి లోకాయుక్త, జిల్లా అధికారులను వివరణ కోరడం జరిగింది.అధికారులు, ఆనందయ్య అందిస్తున్న మందు పట్ల ఎటువంటి వ్యతిరేకత వ్యక్తం చేయనప్పటికీ, లోకయుక్తకు నివేదిక అందించేందుకు, మందును పరిశీలించవలసిన అవసరం ఉందని చెప్పిన మీదట, మందు యొక్క ప్రభావం పరిశీలించుటకు గడువు కోరడమైనది.వీలైనంత త్వరలో, 24 గంటలలోపే మందు యొక్క ప్రభావంపై పరిశీలన పూర్తిచేయవలసినదిగా కోరాం. కరోనా నివారణలో భాగంగా, మందు పరిశీలన పూర్తయిన వెంటనే, ప్రజలెవ్వరికీ అసౌకర్యం కలగకుండా, భౌతిక దూరం పాటిస్తూ, ఆనందయ్య అందించే ఆయుర్వేద మందు పంపిణీకి త్వరలోనే చర్యలు చేపడుతామని తెలిపారు.

## గాజువాక నియోజకవర్గం లో మంచినీటి కొరత తీర్చాలి

**కె బి ఆర్ ప్లాంట్ పరిశీలించిన వై ఎస్ ఆర్ సి పి గాజువాక ఇంచార్జ్ దేవన్ రెడ్డి**


విశాఖపట్నం గాజువాక నియోజకవర్గం లో తాగునీటి సమస్య చాలా ఎక్కువగా ఉందని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కి చెప్పగా అధికారులు జోనల్ కమిషనర్ శ్రీధర్ , ఎ ఈ రాజ్ కుమార్ వారితో మాట్లాడడం జరిగింది. రెండు రోజుల తర్వాత కె బి ఆర్ వాటర్ ప్లాంట్ ఎ ఈ రాజ్ కుమార్ ఎమ్మెల్యే గారికి ఫోన్ చేసి ఇక్కడ ఉన్న 10 ఎం జె డి.2 ఎం జె డి 2 క్లీన్ చేయడం జరిగిందని వారు చెప్పడం జరిగింది.ఎమ్మెల్యే తన కుమారులకు కె బి ఆర్ వాటర్ ప్లాంట్ చూసి పరిశీలించ మని చెప్పగా . గురువారం ఉదయం 10 గంటలకు గాజువాక ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి , 74 వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి ఇద్దరూ జీవీఎంసీ కె బి ఆర్ వాటర్ ప్లాంట్ పరిశీలించేందుకు వార్డ్ కార్పొరేటర్ లు. 64 వార్డ్ వైసిపి ఇంచార్జ్ ధర్మాలు శ్రీను ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగినది.ఈ సందర్భంగా దేవన్ రెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం లో మంచి నీటి సమస్య పై ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గారు కి ఫోన్ కాల్ ద్వారా మంచినీరు ఎర్రగా వస్తుందని. సకాలంలో వాటర్ రావట్లేదని చెప్పడం జరిగింది. ఎమ్మెల్యే గారి ఆదేశాల మేరకు 12 ఎం జె డి కె బి ఆర్ వాటర్ ప్లాంట్ పరిశీలించేందుకు 64వ వార్డ్ యారాడ గ్రామం లో వాటర్ సమస్య ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన వార్డు వైసీపీ ఇన్ చార్జ్ ధర్మాల శ్రీను మరియు వార్డ్ కార్పొరేటర్ లు అంతా కలిసి పరిశీలించడం జరిగింది . అక్కడ 14 మోటార్ సర్వీస్ లు ఉండగా అందులో 8 మోటర్లు పనిచేస్తున్నాయని . మిగిలిన ఆరు మోటార్లను రెండు రోజుల్లో వర్క్ చేసే విధంగా చేస్తామని అందరికీ వాటర్ అందిస్తామని ఎ ఈ రాజు కుమార్ చెప్పడం జరిగిందని ఆయన మాట్లాడారు. అలాగే జీవీఎంసీ కమిషనర్ సుజన మేడం గారికి గాజువాక నియోజకవర్గం లో కే బీ ఆర్ ప్లాంట్ లో మోటార్స్ పాత బడి ఉన్న వలన వాటర్ సమస్యలు ఎక్కువ వస్తున్నాయని. అలాగే వార్డుల్లో పైప్ లైన్స్ సరిగ్గా లేకపోవడం వల్ల ప్రజలకు వాటర్ అందట్లేదని మా నియోజకవర్గానికి జీవీఎంసీ నిధులు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం ధర్మల శ్రీను మాట్లాడుతూ యారాడ గ్రామం లో నీటి సమస్య చాలా ఎక్కువ ఉందని అక్కడికి వెళ్లే పైప్లైన్ వాటర్ మోటర్ సరిగ్గా లేదని దానిని తక్షణమే కొత్తది ఏర్పాటు చేయాలని అన్నారు. గంగవరం గ్రామంలో కూడా ఇదే సమస్య చాలా ఎక్కువగా ఉందని సకాలంలో త్రాగు నీరు రాక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో ఎ ఈ కె వి ఎన్ రాజుకుమార్,ఎలక్ట్రికల్ డి ఈ లక్ష్మోజీరావు రావు , 66 వార్డ్ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్, 70 వార్డ్ కార్పొరేటర్ ఉరుకుటి చందు , ఈ ఈ పి వెంకట రావు, డి ఈ ఈ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి విస్తృత స్థాయి సమావేశం

**పాల్గొన్న జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర , కోఆర్డినేటర్ కేఎన్ఆర్**

విశాఖపట్నం గాజువాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు అధ్యక్షతన జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర జూమ్ మీటింగ్ లో ముఖ్య అతిదిగా పాల్గొని కరోన తీవ్రత పై తీసుకోవలసిన పలు సూచనలు సలహాలు చెప్పారు. ఇటీవల కరోనతో అకాలమరణం చెందిన నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు ఇంద్రసేన రెడ్డి, సీనియర్ ఎస్ సి సెల్ జిల్లా నాయకులు శైలేష్ బాబు , పాత 70వ వార్డు మాజీ అధ్యక్షుల దుంపా. దర్మారావు , వీరి బావమరిది కుంచా.శ్రీను, 68వ వార్డు కార్యదర్శి మోహన్ , 69వ వార్డు శీలానగర్ సీనియర్ నాయకులు సుభాష్ చంద్రబోస్ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. అందరూ తగిన జాగ్రత్తలు తీసుకొని పార్టీ తరపున పేదలకు పార్టీ కార్యకర్తలకు అన్ని విదాలా సహాయసహకారాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కెఎన్ఆర్ మాట్లాడుతూ అధ్యక్షులు పిలుపు మేరకు గాజువాక నియోజకవర్గంలో పార్టీ పేద కార్యకర్తలకు తనవంతు సహాయంగా ఉచితంగా మందులను మోదీ వైద్య కిట్ రూపంలో అందజేసి ఆదుకుంటానని, అదేవిదంగా ఎవరైతే వార్డు అధ్యక్షులు వైద్యం కోసం బీమా తీసుకోలేదో వారికి కూడ తనవంతు సహాయసహకారాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అఫీస్ బేరర్స్ ప్రసాద్, సుబ్రమణ్యం,వగ్రి.లలిత,దామోదర్ యాదవ్,కోకన్వీనర్లు గూటూరు.శంకరరావు , నాగేశ్వరరావు,రాష్ట్ర స్థాయి నాయకులు శశిదరన్ పిళ్లై ,జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, 75వ వార్డు అధ్యక్షుడు ముసలయ్య , 76 ప్రదాన కార్యదర్శి రవికుమార్,ఉపాధ్యక్షులు ప్రసాద్ , 68వ వార్డు అధ్యక్షులు అప్పలరాజు ,69వ వార్డు అధ్యక్షులు చందు,71వ వార్డు అధ్యక్షురాలు పుష్పలత,మహిళామోర్చా నాయకురాలు రోహిణి ,79వ వార్డు అధ్యక్షులు తాతారావు , 85వ వార్డు అధ్యక్షులు సత్తిబాబు, 86వ వార్డు అధ్యక్షుడు ఎ.వి.రమనరావు,ఐ.టి సెల్ ఇంచార్జ్ రామస్వామి, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ రాజశేఖర్,హెల్ప్ డెస్క్ ఫీల్డ్ ఇంచార్జ్ రామునాయుడు,64వ వార్డు ప్రదాన కార్యదర్శి పేర్ల.అప్పారావు తదితరులు పాల్గొని ఆయా వార్డుల సమస్యలు వాటి పరిష్కారానికి పలు సూచనలు సలహాలు చెప్పారు. ప్రతి బుధవారం సాయంత్రం 7 గం.ల నుండి 8 గం.ల వరకు వర్చువల్ సమావేశాలను నిర్వహిస్తామని కే.ఎన్.ఆర్ చెప్పారు.

# వన్ మ్యాన్ ఆర్మీలా సోను



ముంబై, మే 20, (న్యూస్ పల్స్)రీలైఫ్ లో సోనూ సూద్ విలన్ వేషాలే వేశారు. ఆయన అతి భయంకరమైన ప్రతి నాయకుడిగా కనిపించి జనాలను బెంబేలెత్తించారు. కానీ విలన్ గా వేసిన వారు అందరూ రియల్ లైఫ్ లో దుష్టులు కారు అని ఎన్నో సార్లు రుజువు అయింది. ఇక సోనూ సూద్ గత ఏడాది మొదటి దశ కరోనా నుంచి తన హీరోయిజాన్ని చూపిస్తూ వస్తున్నాడు. పుడు రెండవ దశలో కూడా ఆయన నాన్ స్టాప్ గా జనాలకు సేవ చేస్తూ నేనే హీరో అంటున్నాడు. సోనూ సూద్ సేవలను మెచ్చని వారు ఎవరూ లేకపోయినా ఆయన వీర లెవెల్ హీరోయిజం మాత్రం కొందరికి ఇబ్బందికరంగా మారుతోందిట.సోషల్ మీడియాలో తెలుగు జనాలు ఎక్కువగా హడావుడి చేస్తూ ఉంటారు. వీరంతా ఇపుడు సోనూ సూద్ తో మన హీరోలను పోలుస్తున్నారు. ఆయన రియల్ లైఫ్ లో హీరో గా ఉంటున్నారు. కానీ మన వెండి తెర వేలుపులు ఏం చేస్తున్నారు అంటూ ఏకంగా సెటైర్లు వేస్తున్నారు. కరోనా వేళ లాక్ డౌన్ టైమ్ లో తోట పని ఇంటి పని వంట పని చేస్తున్నట్లుగా ఫోటోలకు ఫోజులు ఇవ్వడం కాదు జనాలకు కాస్తా సేవ చేయండి డమ్మీ గాడ్స్ అంటూ కౌంటర్లేస్తున్నారు. దీంతో ఈ పోలికే చాలా మందికి చిక్కులు తెచ్చిపెడుతోందిట.నిజానికి మొదటి దశ కరోనా వేళలో మన హీరోలు కూడా తమకు తోచిన విధంగా సేవ చేశారు. విరాళాలను కలెక్ట్ చేసి సినీ కార్మికుల ఆకలి తీర్చారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి సినీ కార్మికులకు ఉచితంగా వ్యాక్సిన్ వేయిస్తామని కూడా చెప్పుకొచ్చారు. అయితే రెండవ దశలో దేశం మొత్తం ఏలికల నుంచే పెద్దగా స్పందన లేదన్నది ఘాటు విమర్శ. అంతా లైట్ గానే తీసుకున్నారు. దీంతో సినీ వర్గం కూడా కొంత సైలెంట్ అయింది అంటున్నారు. దీనికంటే కూడా మరి కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయని చెబుతారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలతోనూ టాలీవుడ్ కి అవసరాలు ఉన్నాయి. గతంలో వరదల వేళ కేసీయార్ సర్కార్ కే ఎక్కువ మంది హీరోలు విరాళాలు ఇచ్చారు. దాంతో ఏపీకి సాయమేదీ అన్న ప్రశ్నతో పాటు పెద్ద రచ్చ కూడా అయింది. ఇపుడు కూడా ఇస్తే ఇద్దరికీ ఇవ్వాలి, అందుకే గమ్మున ఉంటే పోలా అనే ఇలా చేస్తున్నారు అన్న ప్రచారమూ ఉంది.సాయం అనగానే కేవలం సినిమా వర్గం మీదనే అందరూ చూస్తారు. ఎందుకంటే వారు వెండి తెర ద్వారా డైరెక్ట్ గా పరిచయం అవుతారు కాబట్టి. కానీ వారిని మించి సంపన్నులు ప్రముఖులు సమాజంలో చాలా మంది ఉన్నారు. అంతా కలసి తలో చేయి వేస్తే ఈ కష్టకాలంలో ప్రభుత్వాలకు కాస్త చేయూత సాగదీసుకునే వీలు ఉంటుంది అంటున్నారు. తమిళనాడులో హీరోలంతా క్యూ కట్టి మరీ కొత్త సీఎం స్టాలిన్ కి విరాళాలు ఇస్తున్నారు.

## అర్చకుల వేతనాలకు బడ్జెట్ కేటాయింపులు హర్షణీయం

**స్వరూపానందేంద్ర స్వామి**

విశాఖపట్నం అర్చకుల వేతనాలను పెంచడమే కాకుండా పెంచిన వేతనాలను చెల్లించేందుకు వీలుగా బడ్జెట్ కేటాయింపులు జరపడం పట్ల విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్చకుల వేతనాల కోసం బడ్జెట్లో రూ. 120 కోట్ల కేటాయింపులు జరపడంపై స్వామిజీ స్పందించారు. దశాబ్దాలుగా అర్చకుల వేతనాల కోసం పాలకులెవరూ పట్టించుకోలేదని తెలిపారు. మ్యానిఫెస్టోలో ఉంచినా అర్చకుల వేతనాలను పెంచాలన్న ఆలోచనను నిర్లక్ష్యం చేసారని అన్నారు. జీతాలను పెంచడమే గాకుండా తదనుగుణంగా బడ్జెట్లో నిధులు కేటాయించడం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభినందనీయుడని అన్నారు. కరోనా కారణంగా ఇబ్బందులు పడుతున్న అర్చకులకు ప్రభుత్వ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు. రిషికేశ్ లో ఉన్న మేము ఈ వార్త విని ఎంతో ఆనందించమని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికి రాజశ్యామల అమ్మవారి ఆశీస్సులు పరిపూర్ణంగా ఉంటాయని స్వరూపానందేంద్ర స్వామి అన్నారు.

## ఏరోసోల్స్ 10 మీటర్ల దూరం వ్యాపిస్తాయి



హైదరాబాద్: కరోనా వైరస్ వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాప్తి చెందడానికి ప్రధానంగా మూడు మార్గాలు ఉన్నాయి. దాంట్లో తుంపర్లు మొదటిది. వైరస్ సంక్రమించిన వ్యక్తి.. తుమ్మినా.. దగ్గినా.. ఆ తుంపర్లు సుమారు రెండు మీటర్ల దూరం ప్రయాణిస్తాయి. ఇక రెండవది ఏరోసోల్స్. ఏరోసోల్స్ అంటే అతిసూక్ష్మ తుంపర్లు. ఈ ఏరోసోల్స్ గాలిలో సుమారు పది మీటర్లు ప్రయాణిస్తాయని ఇవాళ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ ఆఫీసు తన మార్గదర్శకాల్లో పేర్కొన్నది. పాజిటివ్ వ్యక్తి నుంచి రిలీజైన తుంపర్లు ఏదైనా వస్తువుపై పడినా.. ఆ సర్ఫేస్‌పై వైరస్ సజీవంగా కొంత సమయం ఉంటుంది. ఇది మూడవ మార్గం.అయితే పెద్ద సైజులో ఉండే తుంపర్లు సాధారణంగా .. కింద పడిపోతాయి. కానీ చిన్న సైజులో ఉండే ఏరోసోల్స్ మాత్రం చాలా దూరమే ప్రయాణిస్తాయి. అవి కనీసం పది మీటర్ల దూరం ప్రయాణిస్తాయని ప్రభుత్వ సైంటిఫిక్ అడ్వైజర్ స్పష్టం చేశారు. దీని వల్ల ఎక్కువ శాతం వైరస్ సంక్రమించే ప్రమాదం ఉన్నట్లు హెచ్చరించింది. ఒకవేళ మీరు ఇండోర్ స్పేస్‌లో ఉన్నట్లు అయితే ఆ ప్రమాదం మరింత తీవ్రంగా ఉంటుంది. ఎందుకంటే చాలా త్వరగా ఆ ప్రాంతాల్లో వైరస్ లోడ్ అధికం అవుతుంది. దీని వల్ల వ్యాప్తి కూడా ఎక్కువ జరిగే అవకాశాలు ఉంటాయి. ఔట్‌డోర్ ప్రదేశాల్లో వైరస్ వ్యాప్తి ప్రభావం తక్కువగా ఉంటుందని, ఎందుకంటే వైరస్ కణాలు చాలా త్వరగా గాలి ద్వారా కొట్టుకుపోతాయని అడ్వైజరీ చెప్పింది.వైరస్ సంక్రమిత వ్యక్తి నుంచి వెలుబడిన తుంపర్లు వేర్వేరు ప్రదేశాల్లో.. వేర్వేరు వస్తువులపై పడుతుంటాయి. అయితే కలుషితమైన ఆ ప్రదేశాలను ఎవరైనా ముట్టుకుని.. చేతులను శానిటైజ్ చేసుకోకుండా.. నోట్లో కానీ, కంట్లో కానీ, ముక్కులో కానీ పెట్టుకుంటే, దాని ద్వారా వైరస్ వ్యాప్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. గ్లాస్, ప్లాస్టిక్, స్టీల్ లాంటి వస్తువులపై.. వైరస్ ఎక్కువ కాలం జీవిస్తుందని సైంటిఫిక్ అడ్వైజరీ పేర్కొన్నది. డోర్ హ్యాండిళ్లు, లైట్ స్విచ్‌లు, టేబుళ్లు, చైర్లు, ఫ్లోర్‌ను ఎప్పటికప్పుడు క్రిమిసంహారకాలతో శుభ్రం చేయాలన్నది. బ్లీచింగ్, ఫినాయిల్ లాంటి వాటిని కూడా క్లీనింగ్ కోసం వాడవచ్చు. సరైన వెంటిలేషన్ ఉంటే.. ఈ సమస్యలన్నీ తప్పించుకోవచ్చు అని సైంటిఫిక్ అడ్వైజరీ ఆఫీసు తన మార్గదర్శకాల్లో చెప్పింది.

## మట్టి మాఫియా పై అర్ధరాత్రి పోలీసులు మెరుపు దాడులు

రాజమండ్రి తూర్పు గోదావరి జిల్లా .పి.గన్నవరం మండలం యర్రంశెట్టి వారిపాలెంలో లంకప్రాంతం నుండి అక్రమంగా మట్టి, ఇసుక తరలింపు కొనసాగుతోంది. ఇళ్ల స్థలాలు మేరక పేరుతో అనుమతులు పొందిని మట్టి మాఫియా ఇసుకను పక్కదారి పట్టిస్తుందని పలు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో పక్క సామాచారంతో అర్ధరాత్రి పోలీసులు మెరుపు దాడులు జరిపారు. అమలాపురం డీఎస్పీ మాధవరెడ్డి ,ఇద్దరు సీఐ లు, గన్నవరం ఎస్ ఐ యర్రంశెట్టి వారి పాలెం మట్టి తవ్వకాల ప్రాంతంలో దాడులు జరిపారు. ఆరు లారీలు, రెండు జెసిబి యంత్రాలను పోలీసులు సీజ్ చేసారు. పలువురి పై కేసునమోదు చేసారు.

# కృష్ణపట్నం లో నేటి నుండి"కరోనాకు మందు పంపిణీ"

**- కాకాని గోవర్ధన్ రెడ్డి**

నెల్లూరు ( విభారె) నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, ముత్తుకూరు మండలం, కృష్ణపట్నం కరోనా మందు పంపిణీపై స్పష్టతనిచ్చిన వై. యస్. ఆర్. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి కృష్ణపట్నంలో బొణిగి ఆనందయ్య కరోనా వ్యాధిని నియంత్రించడానికి, కరోనా సోకిన వారికి నయం చేయడానికి అందజేస్తున్న మందును, శు క్రవారం నుండి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిపరంగా దొరికే సహజసిద్ధమైన వస్తువులతో, ఆనందయ్య తయారు చేసే ఆయుర్వేద మందు పట్ల ఎటువంటి హానీ ఉ ఒడదన్నారు. కృష్ణపట్నంలో అందజేస్తున్న మందు వల్ల అనేకమంది కరోనా బారి నుండి బయటపడి, వారి ఆరోగ్యం కుదుట పడిందన్నారు. ఆనందయ్య అందిస్తున్న మందు పట్ల ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేకమంది ఆసక్తి కనబరుస్తున్నారని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కరోనా ఉధృతిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడానికి, తిరిగి ఆయుర్వేద మందును పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించడం జరిగింది అన్నారు. కరోనా సోకిన వారికి వేరుగా, కరోనా రాకుండా నియంత్రించడానికి వేరుగా భౌతిక దూరం పాటిస్తూ, మందు పంపిణీ చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# స్మార్ట్ గా పనులు పూర్తి చేయండి

**అభివృద్ధి పనులపై సమీక్షించిన కమిషనర్**

తిరుపతి,మే 20 ( విభారె) నగరపాలక సంస్థ పరిధిలో స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎం.డి. గిరీషా అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల పురోగతి పై గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. వినాయక సాగర్, గొల్లవాణిగుంట, కొరమేనుగుంట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. గరుడ వారధి, భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ఏ మేరకు జరుగుతున్నాయో తెలుసుకుని మరింత వేగంగా పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులు ఆదేశించారు. రామాపురం రిజర్వాయర్ లో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ నుండి విద్యుత్ ఉత్పత్తి, వినియోగం సజావుగా జరిగేలా చూడాలన్నారు. తూకివాకం వద్ద జరుగుతున్న 6 మెగా వాcట్ల సోలార్ ప్లాంట్ పనులు త్వరగా పూర్తి చేస్తే విద్యుత్ కొరత రాకుండా ఉ ంటుందన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, ముందుగా రూపొందించిన ప్లాన్ ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తయిన ప్రాజెక్టు నిర్వహణ ఎలా ఉందని అడిగి తెలుసుకుని కొన్ని మార్పులు, చేర్పులను సూచించారు. ఏది ఏమైనా అభివృద్ధి పనుల పురోగతి పై అధికారులు నిత్య పర్యవేక్షణ చేసి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. టెండర్ దశలో ఉన్న పనులు కూడా త్వరగా జరిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డి.ఈ. లు విజయకుమార్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, గోమతి, దేవిక, ఏఈ కామ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాకాని రమణారెడ్డి ఉత్తర క్రియలు

**రమణా రెడ్డి జీవిత చరిత్ర పుస్తకం విడుదల**

నెల్లూరు( విభారె) నెల్లూరు జిల్లా, సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి తండ్రి కాకాణి రమణారెడ్డి ఉత్తరక్రియలు స్వగ్రామం తోడేరులో శాస్త్రయుక్తంగా నిర్వహించడం జరిగింది.కాకాణి రమణారెడ్డి సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాన్ని మాజీ మంత్రివర్యులు, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.కాకాణి రమణారెడ్డి జీవన గమనం పై రచించి, గానం చేసిన పాటను మాజీ మంత్రివర్యులు, వెంకటగిరి శాసన సభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి గారు విడుదల చేయడం జరిగింది.కాకాణి రమణారెడ్డి ఉత్తరక్రియలు కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, వెంకటగిరి శాసన సభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి , కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి , నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , విజయ డైరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ శాసనసభ్యులు నెలవెల సుబ్రహ్మణ్యం , బీజేపీ సీనియర్ నాయకులు కర్నాటి ఆంజనేయులు , జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ వీరి చలపతిరావు , జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నిరంజన్ బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింహ వాహనంపై అనంతతేజోమూర్తి

తిరుపతి తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన గురువారం ఉదయం గోవిందరాజస్వామి సింహ వాహనంపై అభయమిచ్చారు. కోవిడ్ -19 వ్యాప్తి నేపథ్యంలో ఆలయంలో ఏకాంతంగా వాహనసేవ నిర్వహించారు. మృగాల్లో రారాజు, గాంభీర్యానికి చిహ్నం సింహం. యోగశాస్త్రంలో సింహం వాహనశక్తికి, శీఘ్రగమన శక్తికి మరో రూపు గా భావిస్తారు. భక్తుడు సింహబలం అంతటి భక్తిబలం కలిగినప్పుడు భగవంతుడు అనుగ్రహిస్తారు. అనంతతేజోమూర్తి అయిన స్వామివారు రాక్షసుల మనసులో సింహంలా గోచరిస్తారని స్తోత్రవాఙ్మయం కీర్తిస్తోంది. అందుకే ధీరోదాత్తుడైన శ్రీవారు సింహవాహనాన్ని అధిరోహిస్తారు. అనంతరం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు. చందనంలతో అభిషేకం జరిపారు. సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ముత్యపుపందిరి వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో రాజేంద్రుడు, ఏఈవో రవికుమార్ రెడ్డి, ప్రధాన అర్చకులు ఏ.టి.శ్రీనివాస దీక్షితులు, కంకణ బట్టార్ ఏ.టి. పార్థసారధి దీక్షితులు, సూపరింటెండెంట్లు వెంకటాద్రి, కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునీంద్రబాబు, కామరాజు, అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలా? ప్రతి ఉదయం వీటిలో ఏదైనా ఒకటి తాగి చూడండి, ఫలితం మీకే తెలుస్తుంది ...



మీ ఉదయం దినచర్య ఏమిటి? మీరు వేడిగా ఒక కప్పు కాఫీ కావాలనుకుంటున్నారా లేదా నేరుగా అల్పాహారం తీసుకోవాలనుకుంటున్నారా? మీరు ఈ రెండు రకాల్లో ఏది ఎంపిక చేసుకున్నా, మీరు మీ దినచర్యను వెంటనే మార్చాలి.సాధారణంగా మనం ఉదయం నిద్రలేచినప్పుడు, మన శరీర జీవక్రియ నెమ్మదిగా ఉంటుంది, కడుపు పిహెచ్ ఎక్కువగా ఉంటుంది మరియు మనం నిర్జలీకరణానికి గురవుతాము. ఈ సందరరేలో, కడుపుకు భారీ ఆహారం లేదా కెఫిన్ పంపినప్పుడు, ఇది జీర?వ్యవస్థ ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుంది .సాధారణంగా మనం 12 గంటలు తిననప్పుడు, మన కడుపు మరియు ప్రేగులు పత్తి లాగా మ ృదువుగా మారుతాయి. ఈ సమయంలో ఎక్కువ పోషకాలను గ్రహించగలుగుతారు. కాబట్టి మీరు ఉదయాన్నే నిద్రలేచి ఖాళీ కడుపుతో కొన్ని పోషకమైన పానీయాలు తాగినప్పుడు, జీర?వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది మరియు రోజంతా మెరుగ్గా పనిచేస్తుంది.మీ జీర?వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ వ్యాసం ఉదయం నిద్రలేచిన వెంటనే మీరు త్రాగడానికి మీకు ఒక పానీయం పరిచయం చేస్తోంది.మీరు ఉదయం నిద్ర లేచినప్పుడు ఖాళీ కడుపుతో గోధుమ గడ్డి రసం తాగడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా, శరీరానికి బరువు తగ్గడం, చర్మ సమస్యలను సరిదిద్దడం, అధికంగా ఆహారం తీసుకోవడం తగ్గించడం, కణాలలో విషాన్ని బహిష్కరించడం, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడం, రక్త ప్రవాహాన్ని ఉత్తేజపరచడం, అలసటను తగ్గించడం మరియు జీర?క్రియను మెరుగుపరచడం వంటి అనేక ప్రయోజనాలను ఇది కలిగి ఉంటుంది.గోరువెచ్చని నీటిలో 2 టేబుల్ స్పూన్ల నిమ్మరసం కలపండి మరియు ఉదయం త్రాగాలి. ఇది రిఫ్రెష్ మరియు దానిలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి, శరీరం యొక్క పిహెచ్ స్థాయిని నిర్వహించడానికి మరియు శరీరం నుండి విషాన్ని బహిష్కరించడానికి సహాయపడుతుంది. దీనిలోని సిట్రిక్ ఆమ్లం జీర? సమస్యలను నివారిస్తుంది మరియు జీర?వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.మీ అల్పాహారం పానీయం చాలా రుచికరమైనదని మీరు అనుకుంటే, అల్లం రసం మరియు తేనె నిమ్మకాయ నీటితో కలపండి. ఈ పానీయాన్ని ఉదయం వెచ్చని స్థితిలో తాగడం వల్ల జీర?వ్యవస్థ బలపడుతుంది మరియు అజీర?ం, వికారం మరియు గుండెల్లో మంటను నివారిస్తుంది. ఈ పానీయం రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా శీతాకాలంలో ఈ పానీయం తాగడం అలవాటు చేసుకోవడం చాలా మంచిది. మొదట అల్లం వేడినీటిలో వేసి, కాసేపు ఉడకబెట్టి, హరించడం మరియు వెచ్చని స్థితికి చేరుకున్నప్పుడు, నిమ్మరసం మరియు తేనె వేసి త్రాగాలి.భారతీయ వంటకాల్లో మూలికలు మరియు సుగంధ ద్రవ్యాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆయుర్వేదంలో ఔషధ లక్షణాల వల్ల వీటిని విస్త ృతంగా ఉ పయోగిస్తున్నారు. బెరడు, మిరియాలు, అల్లం మరియు పసుపు మూలాన్ని నీటిలో ఉడకబెట్టి, నిమ్మరసం మరియు తేనెతో కలిపి వెచ్చని స్థితిలో పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉదయం ఈ పానీయం తాగడం వల్ల రోగనిరోధక శక్తిని బలోపేతం చేయవచ్చు మరియు శీతాకాలంలో జలుబు మరియు ఫ్లూ నుండి బయటపడవచ్చు.ఆపిల్ సైడర్ వెనిగర్ ఆరోగ్య ప్రయోజనాలతో సమ ృద్ధిగా ఉంటుంది. ఆరోగ్యంగా ఉండటానికి వీటిని డైట్‌లో చేర్చాలి. ఇంకా ఎక్కువ, మీరు ఖాళీ కడుపుతో ఆపిల్ సైడర్ వెనిగర్ తాగితే, మీరు వెంటనే అపానవాయువు మరియు ఉబ్బరం నుండి బయటపడతారు. అదనంగా ఇది కడుపు లేదా ప్రేగులలోని బ్యాక్టీరియాను చంపడానికి సహాయపడుతుంది. ఒక గిన్నెలో, 1 టేబుల్ స్పూన్ ఆపిల్ సైడర్ వెనిగర్ నిమ్మరసం, అల్లం రసం, తేనె, వెల్లుల్లి రసం మరియు ఒక చిటికెడు బెరడు పొడి కలపాలితులసి ఆకులను నీటిలో ఉడకబెట్టి, శీతాకాలంలో ఉ దయం లేచినప్పుడు త్రాగాలి.

# గంగూలీది కష్టపడే తత్వం కాదు.. కానీ: చాపెల్

సిడ్నీ: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, టీమిండియా మాజీ కోచ్ గ్రెగ్ చాపెల్ మరోసారి సౌరవ్ గంగూలీ గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. గంగూలీది కష్టపడే తత్వం కాదని, కెప్టెన్‌గా ఎప్పుడూ పెత్తనం చెలాయించడమే తనకు ఇష్టమని వ్యాఖ్యానించాడు. కాగా 2005- 2007 మధ్య కాలంలో గ్రెగ్ చాపెల్ భారత క్రికెట్ జట్టు కోచ్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఈ రెండేళ్లలోనే, అప్పటి టీమిండియా సారథి గంగూలీ, చాపెల్ మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ముఖ్యంగా, చాపెల్ హయాంలోనే గంగూలీ కెప్టెన్సీ చేజారడం, ఆటగాడిగా తుదిజట్టులో కూడా చోటు దక్కకపోవడంతో ఇద్దరి మధ్య వివాదం మరింత ముదిరింది. దీంతో వీరిద్దరు ఇప్పటికే ఎన్నోసార్లు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలో, తన ఆత్మకథ ఏ సెంచరీ cఈజ్ నాట్ ఎనఫ్cలో తన క్రికెట్ కెరీర్‌లో చేసిన అతి పెద్ద పొరపాటు ఏదైనా ఉందంటే అది ఆసీస్ మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్‌ను కావాలని కోచ్‌గా నియమించుకోవడమేనని పేర్కొన్నాడు. అదే విధంగా, తన మానసిక స్థితి బాలేదంటూ బీసీసీఐకి చాపెల్ రాసిన లేఖ వల్ల తన కెరీర్ నాశనమైందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇక చాపెల్ సైతం వీలు చిక్కినప్పుడల్లా గంగూలీని విమర్శిస్తూనే ఉన్నాడు.

# టాలీవుడ్ సూపర్ హిట్ కాంబో.. వెంకటేష్ - రాఘవేంద్రరావు



దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు టాలీవుడ్ సీనియర్ హీరోలందరితో సక్సెస్ ఫుల్ సినిమాలు చేశారు. అందులో విక్టరీ వెంకటేష్ - రాఘవేంద్రరావు కాంబినేషన్ కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. ఇప్పటి వరకు ఎనిమిది సినిమాలకు పనిచేసి వెండితెరపై సూపర్ హిట్ కాంబినేషన్ అనిపించుకున్నారు. వీరి కాంబోలో వచ్చిన సినిమా గురించి ఇప్పుడు తెలుసుకుందాం!ccకలియుగ పాండవులుcc సినిమాతో రాఘవేంద్రరావు - వెంకటేష్ కాంబినేషన్ ప్రారంభమైంది. ఈ సినిమాతో వెంకీని హీరోగా లాంచ్ చేశాడు దర్శకేంద్రుడు. ఇందులో ఖుష్బూ హీరోగా నటించింది. ఫస్ట్ సినిమాతోనే మంచి సక్సెస్ సాధించిన వెంకటేష్ బెస్ట్ యాక్టర్ గా స్పెషల్ జ్యూరీ నంది అవార్డ్ అందుకున్నాడు. 1986లో వచ్చిన ఈ సినిమా సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రూపొందింది.వెంకటేష్ - రాఘవేంద్ర రావు కాంబినేషన్ లో వచ్చిన రెండో చిత్రం ccభారతంలో అర్జునుడుcc. వెంకీ - ఖుష్బూ జోడీని ఇందులో రిపీట్ చేశారు. ఇది హిందీలో సన్నీడియోల్ హీరోగా నటించిన 'అర్జున్‌వ సినిమాకు తెలుగు రీమేక్. 1987లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఫ్లాప్ గా నిలిచింది. ఈ చిత్రాన్ని రాఘవేంద్రరావు తండ్రి కేఎస్ ప్రకాష్ రావు నిర్మించారు.సూపర్ హిట్ కాంబోలో వచ్చిన మూడో చిత్రం ccఒంటరి పోరాటంcc. 1989లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. వెంకీ కెరీర్ కు అప్పట్లో ఈ మూవీ బాగా ప్లస్ అయిందని చెప్పవచ్చు. రాఘవేంద్రరావు - వెంకటేష్ కలయికలో వచ్చిన నాల్గవ చిత్రం ccకూలీ నెం.1cc (1991). సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ఈ సినిమాతోనే టబు హీరోయిన్ గా పరిచయమైంది.వెంకటేష్ - రాఘవేంద్రరావు కలిసి చేసిన ఐదో చిత్రం ccసుందరకాండcc(1992). ఇది cసుందరకాండంc అనే కొంత తమిళ చిత్రానికి రీమేక్ గా తెరకెక్కింది. అప్పటి వరకు వీరి కాంబోలో వచ్చిన చిత్రాలకు భిన్నంగా ఉన్న ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకుంది. వీరి కాంబినేషన్లో రూపొందిన ఆరో చిత్రం cముద్దుల ప్రియుడుc. 1994లో వచ్చిన ఈ సినిమా మ్యూజికల్ హిట్ గా నిలిచింది.దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు - విక్టరీ వెంకటేష్ కలయికలో వచ్చిన ఏడో చిత్రం ccసాహసవీరుడు సాగరకన్యcc(1996). ఈ చిత్రం కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాన్నే అందుకుంది. ఇక వీరి కాంబినేషన్ లో వచ్చిన ఎనిమిదో చిత్రం చివరి చిత్రం ccసుభాష్ చంద్రబోస్cc. ఇందులో వెంకటేష్ రెండు పాత్రల్లో కనిపించారు. 2005లో భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర డిజాస్టర్ గా నిలిచింది.ఇలా వెంకటేష్ - రాఘవేంద్రావు కలిసి 8 సినిమాలు చేయగా.. అందులో 6 సూపర్ హిట్ గా నిలిచి వీరిని టాలీవుడ్ లో సక్సెస్ ఫుల్ హీరో - డైరెక్టర్ కాంబినేషన్ గా నిలబెట్టాయి.

# చైతూ నిశబ్దానికి కారణమేంటో..!



యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇప్పటికే cలవ్ స్టోరీc సినిమాని పూర్తి చేసిన చైతన్య.. ప్రస్తుతం cథాంక్యూc అనే మూవీలో నటిస్తున్నారు. ఇదే క్రమంలో చైతూ బాలీవుడ్ లో ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. అమీర్ ఖాన్ - కరీనా కపూర్ జంటగా నటిస్తున్న cలాల్ సింగ్ చద్దాc చిత్రంలో నాగచైతన్య కీలక పాత్రలో నటించనున్నారు. విజయ్ సేతుపతి తప్పుకోవడంతో ఆ పాత్ర చైతూ దగ్గరకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే దీని గురించి రోజుకో వార్త వస్తూనే ఉన్నా చైతన్య మాత్రం సైలెంటుగానే ఉంటున్నాడు.cలాల్ సింగ్ చద్దాc సినిమాలో నటిస్తున్నానని చెప్పలేదు.. అలాగని ఇంతవరకు ఆ వార్తలను ఖండించలేదు. దీనికి కారణమేంటనేది తెలియనప్పటికీ ఇదే ఈ సినిమాలో చై పాత్రపై క్యూరియాసిటీ మరింత పెంచోస్తోంది. మరి ఈ సినిమా అక్కినేని హీరో కెరీర్ కి ఏ మేరకు హెల్ప్ అవుతుందో చూడాలి. కాగా అద్వైత్ చందన్ దర్శకత్వంలో cలాల్ సింగ్..c తెరకెక్కుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశకు చేరుకున్న ఈ సినిమా తదుపరి షెడ్యూల్ జూన్ లో లడఖ్ లో ప్రారంభం కానుంది. ఇందులో చైతన్య కూడా జాయిన్ అవుతారని సమాచారం.ఆస్కార్ విజేత టామ్ హాంక్స్ ప్రధాన పాత్రలో వచ్చిన హాలీవుడ్ సినిమా cఫారెస్ట్ గంప్c(1994) రీమేక్ గా cలాల్ సింగ్..c రూపొందుతోంది. ఇందులో బెంజమిన్ బుఫోర్డ్ బ్లూ పాత్రనే చైతన్య చేయనున్నారని తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ చిత్రాన్ని 2021 క్రిస్మస్ సందర్భంగా విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. ఏదేమైనా నాగచైతన్య కూడా తన తండ్రి cకింగ్c నాగార్జున బాటలోనే నడుస్తున్నాడని అర్థం అవుతోంది. నాగ్ తెలుగులో హీరోగా చేస్తున్న క్రమంలోనే అవకాశం వచ్చినప్పుడు హిందీలోనూ నటించారు. ప్రస్తుతం ఆయన cబ్రహ్మాస్త్రc అనే హిందీ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.

# రాధే శ్యామ్ ట్రెండింగ్ లో నిలిపిన డార్లింగ్ ఫ్యాన్స్..!




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నాలుగు పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ ని లైన్ లో పెట్టి ఫ్యాన్స్ ని ఖుషీ చేసాడు. ఇప్పటికే మూడు సినిమాలని సెట్స్ పైకి తీసుకొచ్చిన డార్లింగ్.. మరో ప్రాజెక్ట్ ని వీలైనంత త్వరగా స్టార్ట్ చేయాలని చూస్తున్నారు. అయితే ఇన్ని సినిమాలు చేస్తున్నా వాటి నుంచి రెగ్యులర్ గా అప్డేట్స్ రాకపోవడంతో అభిమానులు కాస్త నిరాశకు గురవుతున్నారు. ముఖ్యంగా cరాధే శ్యామ్c మూవీ డిటైల్స్ కోసం వారు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.cరాధే శ్యామ్ సినిమా ప్యాచ్ వర్క్ మాత్రమే మిగిలి ఉందని అంటున్నారు కానీ ఇంకా ఎంత షూటింగ్ పెండింగ్ లో ఉంది.. అది పూర్తయిందా లేదా అనే దానిపై ఎవరికీ క్లారిటీ లేదు. అలానే ఇప్పటి వరకు ఫస్ట్ లుక్ - ఫెస్టివల్ పోస్టర్స్ - గ్లిమ్స్ తప్ప వేరే అప్డేట్ ఏదీ ఇవ్వకపోవడం ఫ్యాన్స్ ని నిరాశపరిచింది. దీనికి తోడు ఇప్పుడు కరోనా కారణంగా జులై లో విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడే పరిస్థితులు వస్తున్నాయి. ఈ క్రమంలో మిగతా సినిమాలు కూడా లేట్ అయ్యే అవకాశం ఉంది. వీటన్నిటితో ఒకింత అసహనానికి గురైన అభిమానులు దీన్ని సోషల్ మీడియాలో చూపిస్తున్నారు.ఈ నేపథ్యంలో డార్లింగ్ ఫ్యాన్స్ ఎటువంటి కారణం లేకుండా ముందస్తు ప్రణాళికలు లేకుండా cరాధే శ్యామ్c ను ట్రెండ్ చేస్తున్నారు. ట్విట్టర్ లో నేషనల్ వైడ్ ట్రెండింగ్ టాపిక్స్ లో ఒకటిగా నిలిపారు. ఇది ప్రభాస్ ఫ్యాన్ ఫాలోయింగ్ ని తెలియజేస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వారికి అప్డేట్స్ విషయంలో ఇంకొన్ని రోజులు నిరాశ తప్పదని అనిపిస్తోంది. మేకర్స్ కూడా సరైన సమయం కోసం వేచి ఉండడం తప్ప ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.ఏదేమైనా ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో వరుస సినిమాలు చేస్తున్న ఏకైక స్టార్ హీరో ప్రభాస్ అనే చెప్పొచ్చు. రాధా కృష్ణ కుమార్ దర్శకత్వంలో పీరియాడికల్ బ్యాక్ డ్రాప్ లో cరాధే శ్యామ్c సినిమా చేస్తున్నారు. అలానే బాలీవుడ్ దర్శకుడు ఓం రౌత్ రామాయణ ఇతిహాస గాథ ఆధారంగా తెరకెక్కిస్తున్న cఆదిపురుష్c సినిమాలో నటిస్తున్నాడు. ఇదే క్రమంలో cకేజీఎఫ్c డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తో కలిసి cసలార్c మూవీ చేస్తున్నారు. అలానే నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఓ పాన్ వరల్డ్ మూవీ చేయనున్నారు ప్రభాస్.

# లైగర్ బ్యూటీ కిల్లర్ భంగిమకు మైండ్ బ్లాక్



లైగర్ చిత్రంతో టాలీవుడ్ లో అడుగుపెడుతోంది బాలీవుడ్ యువనాయిక అనన్యపాండే. నేటితరం నాయికల్లో స్టైలిష్ అండ్ స్టన్నింగ్ గాళ్ గా వెలిగిపోతున్న ఈ ఫ్యాషనిష్టా ఎంపికలు యువతరంలో హాట్ టాపిక్ గా మారుతున్నాయి.తాజాగా అనన్య షేర్ చేసిన బ్లూ అండ్ బ్లూ లుక్ అంతర్జాలాన్ని షేక్ చేస్తోంది. అలా సింపుల్ గా సోఫాలో వాలిపోయిన అనన్య పొడవాటి కాళ్ల సౌందర్యాన్ని ఎలివేట్ చేస్తూ.. బ్లూ థై స్లిట్ లెహెంగాలో కనిపించింది. అనన్య కిల్లర్ ఫోజ్ కి యూత్ పరేషాన్ అవుతున్నారు. ప్రస్తుతం బోయ్స్ లో ఈ ఫోటో వైరల్ గా మారింది.అనన్య పాండే ఇటీవల తన పుట్టినరోజు సందర్భంగా తన అమ్మమ్మ స్నేహలతా పాండేతో ఉన్న త్రోబాక్ ఫోటోని షేర్ చేసింది. బాల్యంలో అనన్య తన దాదీతో పాటు టేబుల్ మీద కూర్చొని కొంటెగా చిరునవ్వు చిందిస్తూ కనిపిస్తోంది. ఒక ఫోటోలో దాదీని ముద్దాడుతూ కనిపించింది. ఇంతలోనే హాటెస్ట్ ఫోటోషూట్ తో దూసుకొచ్చిందిలా.కొనసాగుతున్న జూ౦×ణ 19 సెకండ్ వేవ్ కారణంగా లైగర్ టీజర్ విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే. అనన్య పాండే ఈ నిర్ణయంతో తీవ్రంగా నిరాశపడిందట. కానీ టీమ్ నిర్ణయాన్ని సదా గౌరవిస్తోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**